


ఆర్ఎన్ఐ/2009/ 28733

స్థాపితం : 2003

# ఆంధ్రనాడు

తెలుగు దినపత్రిక

సంపుటి : 22 సంచిక: 262 తిరుపతి తేది : ఆదివారం 31 ఆగస్టు 2025 పేజీలు : 08 ధర : రూ.6 PUBLISHED FROM TIRUPATI, CHITTOOR, ANNAMAIAH, ANANTHAPUR DISTRICTS







# కృష్ణమ్మ తల్లిని నా కుప్పానికి తీసుకొచ్చా



- కుప్పంలో అన్ని చెరువులు కృష్ణమ్మతో నింపుతా...
- నాటకాలు ఆడడం వైసిపి వంతు... నీళ్లు ఇవ్వడం ఎన్డీఏ వంతు...
- రాయలసీమను రతనాలసీమగా మారుస్తా...
- స్త్రీ శక్తితో ఆటో డ్రైవర్లకు ఇబ్బంది ఉండదు... వారినీ ఆదుకుంటా...
- బహిరంగ సభలో నారా చంద్రబాబు నాయుడు

**కుప్పం - ఆంధ్రనాడు, ఆగస్టు 30:**

నా జీవితంలో ఈరోజు ఒక పవిత్రమైన రోజు... నన్ను ఎనిమిది ఎన్నికల్లో గెలిపించారు... మీ ఇంటి బిడ్డగా, మీ కుటుంబ పెద్దగా... అభిమానించారు, ఆదరించారు... ఆ అభిమానాన్ని నిలబెట్టుకునేందుకు అనునిత్యం పనిచేసా... ఈరోజు కృష్ణమ్మను కుప్పంకు తీసుకు వచ్చినప్పుడు... నా ఆనందం వర్ణనాతీతం అని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. శనివారం కుప్పం మునిసిపాలిటీ పరిధిలోని పరమ సముద్రం చెరువు సమీపంలో గల హంద్రీ-నీవా కాలువలో ప్రవహిస్తున్న కృష్ణమ్మకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జల హారతి నిర్వహించారు. అనంతరం బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ... 'నన్ను 8 సార్లు ఎమ్మెల్యేగా గెలిపించి ఆదరించిన నా కుప్పం నియోజకవర్గానికి కృష్ణా జలాలు తీసుకురావడంతో నా జన్మ ధన్యమైంది. నా సంకల్పం నెరవేరింది. నా ఆనందాన్ని మాటల్లో చెప్పలేను. కృష్ణా పుష్కరాలు 2028లో వస్తుంటే కుప్పానికి మాత్రం రెండేళ్లు ముందే వచ్చాయి. కుప్పం ప్రజలు నన్ను ఇంటి బిడ్డగా ఆదరించారు. వారికి నేను ఏం చేసినా తక్కువే' అని చంద్రబాబు అన్నారు.

### ఎన్టీఆర్ సంకల్పాన్ని నెరవేర్చాం

"ఆనాడు ధవళేశ్వరం, ప్రకాశం బ్యారేజ్ నిర్మాణంతో కాటన్ దొర... కృష్ణా, గోదావరి జిల్లాల పరిస్థితి మార్చేశాడు. అందుకే కాటన్ దొరను అక్కడి ప్రజలు ఆరాధిస్తారు. అలాగే ఎన్టీఆర్ కృష్ణా మిగులు జలాలు సీమకు తేవాలని సంకల్పం చేశారు. సీమను సస్యశ్యామలం చేయాలని కలలు కన్నారు. సీమలో పశువులను బతికించుకోవడానికి రైళ్లలో నీళ్లను తెప్పించిన పరిస్థితి నాడు ఉండేది. వేరుశనగ పంట వేస్తే కనీసం విత్తనాల ఖర్చు కూడా వచ్చేది కాదు. సీమలో ఇలాంటి పరిస్థితిని మార్చాలనే సంకల్పంతో 1999లో హంద్రినీవాను నేనే ప్రారంభించాను.' 2025 నాటికి పరమసముద్రానికి కృష్ణా జలాలు తెచ్చామని సీఎం చంద్రబాబు అన్నారు. 'శ్రీశైలం మల్లన్న పాదాల చెంత నుంచి కుప్పం మల్లన్న వద్దకు కృష్ణా జలాలను తెచ్చాం. గంగమ్మ కరుణించింది...

- మిగతా 2లో..

## చైనాలో మోదీకి ఘన స్వాగతం



- 'వందేమాతరం' నినాదాలతో హోరెత్తిన విమానాశ్రయం
- షాంఘై సదస్సు కోసం చైనాలోని టియాంజిన్‌కు చేరుకున్న ప్రధాని మోదీ
- విమానాశ్రయంలో ఘనంగా స్వాగతం పలికిన ప్రవాస భారతీయులు
- 'వందేమాతరం', 'భారత్ మాతా కీ జై' నినాదాలతో మార్మోగిన పరిసరాలు
- ఆదివారం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో మోదీ భేటీ
- సోమవారం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో కీలక సమావేశం
- సరిహద్దు ఉద్రిక్తతల తర్వాత జిన్‌పింగ్‌తో భేటీకి పెరిగిన ప్రాధాన్యం

2




## వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ పురస్కారం అందుకున్న బాలయ్య...

- హాజరైన బండి సంజయ్, నారా లోకేశ్
- భారత సినీ చరిత్రలో బాలయ్య సరికొత్త రికార్డ్
- వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు
- 50 ఏళ్ల సినీ ప్రస్థానానికి గాను దక్కిన ప్రతిష్ఠాత్మక అవార్డు

2

# కూటమి 15 ఏళ్లు కొనసాగాలి...

- జనసేన భవిష్యత్ కార్యాచరణ ప్రకటించిన పవన్!
- విశాఖలో 'సేనతో సేనాని' సభలో పవన్ కల్యాణ్ కీలక ప్రసంగం
- సామాన్యుడి కోపం నుంచే జనసేన పార్టీ ఆవిర్భవించిందని వెల్లడి
- దసరా తర్వాత 'త్రిశూల్' కార్యక్రమం ప్రారంభిస్తామని ప్రకటన
- రాష్ట్రానికి 15 ఏళ్ల రాజకీయ స్థిరత్వం అవసరమని స్పష్టీకరణ
- 2030 నాటికి బలమైన నాయకత్వాన్ని సిద్ధం చేస్తానని హామీ
- వీరమహిళలకు పార్టీ పదవుల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తామన్న పవన్



**విశాఖపట్నం- ఆంధ్రనాడు, ఆగస్టు 30**

ఆంధ్రప్రదేశ్‌లో చారిత్రక విజయం తర్వాత జనసేన పార్టీ భవిష్యత్ ప్రయాణంపై ఆ పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పూర్తి స్పష్టత ఇచ్చారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడం, రాబోయే దశాబ్దకాలానికి యువ నాయకత్వాన్ని సిద్ధం చేయడమే లక్ష్యంగా కీలక కార్యాచరణను ప్రకటించారు. విశాఖపట్నంలో నిర్వహించిన 'సేనతో సేనాని' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రానికి సుస్థిర పాలన అందించేందుకు ప్రస్తుత ఎన్డీయే కూటమి కనీసం 15 ఏళ్ల పాటు కొనసాగాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు. ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

### సామాన్యుడి కోపం నుంచే జనసేన పుట్టింది

జనసేన పార్టీ ఆవిర్భావం వెనుక ఉన్న స్ఫూర్తిని పవన్ కల్యాణ్ కార్యకర్తలతో పంచుకున్నారు. "ఇది ఏదో కులం, కుటుంబం, ప్రాంతం కోసం పెట్టిన పార్టీ కాదు. ఒక సగటు మనిషి గుండెల్లో రగిలే కోపం నుంచి, ఆవేదన నుంచి పుట్టిన పార్టీ జనసేన" అని ఆయన అన్నారు. గడిచిన 11 ఏళ్లలో తన వ్యక్తిగత జీవితాన్ని, సినిమాలను పక్కనపెట్టి కేవలం పార్టీ కోసమే జీవించానని గుర్తుచేసుకున్నారు. సినీ నటుల లోపల కూడా రగిలే అగ్నిగుండాలు ఉంటాయని అన్నారు. ఎన్నో అవమానాలు, కష్టనష్టాలు ఎదురైనా సిద్ధాంతాలకు కట్టుబడి నిలబడటం వల్లే చారిత్రక విజయం సాధ్యమైందని, పోటీ చేసిన ప్రతీచోటా గెలిచి 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించామని తెలిపారు. ఉద్దానం కిడ్నీ బాధితుల సమస్యల పరిష్కారం, ఏజెన్సీలో గిరిజనుల కష్టాలు తీర్చడం వంటివి తనకు ఆత్మసంతృప్తినిచ్చాయని పేర్కొన్నారు. కేవలం సిద్ధాంతాలపై నమ్మకం ఉన్నవారే నేటికీ తనతో కలిసి నడుస్తున్నారని పవన్ స్పష్టం చేశారు.

### దసరా తర్వాత 'త్రిశూల్'.. నాయకత్వ వికాసమే లక్ష్యం

పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు పవన్ కల్యాణ్ ఒక స్పష్టమైన ప్రణాళికను ఆవిష్కరించారు. దసరా పండుగ తర్వాత 'త్రిశూల్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమం ద్వారా పార్టీలోని ప్రతి క్రియాశీల సభ్యుడిని నేరుగా పార్టీ సెంట్రల్ కమిటీ నేతలతో అనుసంధానం చేస్తామని వివరించారు. దీని కోసం ప్రత్యేకంగా ఒక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

- మిగతా 2లో..




## అమరావతిపై అబద్ధపు ప్రచారం

- మీడియా స్వేచ్ఛ అవసరమే.. హేతుబద్ధంగా ఉండాలి
- సోషల్ మీడియాలో గుడ్డిగా బలపరచవద్దు

**విజయవాడ - ఆంధ్రనాడు, ఆగస్టు 30**

తెలుగుజాతి ఐక్యతను నాడు కోరుకున్నాం. నేటి ఆంధ్రప్రదేశ్‌లో భౌగోళికంగా భిన్నస్వరూపం, స్వభావంతో ఉన్న రాయలసీమ, కోస్తా, ఉత్తరాంధ్ర ప్రాంతాలు పటిష్టంగా, ఐక్యంగా అభివృద్ధి వైపు వేగంగా అడుగులు వేయాలని సమతుల్యమైన సమగ్రాభివృద్ధి సాధించాలని పరితపిస్తున్న వాళ్లలో నేను ఒకడిని. వ్యక్తి స్వేచ్ఛను నేను బలపరుస్తాను. మీడియా స్వేచ్ఛను మనసావాచా బలపరుస్తాను. కానీ, అది భారత రాజ్యాంగం పరిధిలో, మనది పార్లమెంటరీ ప్రజాస్వామ్యం కాబట్టి చట్ట సభలు చేసిన చట్టాల పరిధిలో సామాజిక అభివృద్ధికి దోహదపడే ఆలోచనలతో ఒక శాస్త్రీయమైన దృక్పథంతో, విమర్శ హేతుబద్ధంగా ఉండే రీతిలో సహేతుకమైనటువంటి ఆలోచనలను సమాజంతో పంచుకోవడానికి ఆ స్వేచ్ఛను వ్యక్తిగానీ, మీడియాగానీ సద్వినియోగం చేసుకోవాలని నేను బలంగా కోరుకుంటాను. స్వేచ్ఛను దుర్వినియోగం చేయడం, సమాజంలో అరాచకత్వాన్ని, అభివృద్ధికి అవరోధకంగాను, విషబీజాలు నాటడానికి, వైషమ్యాలను రెచ్చగొట్టడానికి, అబద్దాలను ప్రజల మధ్యలో వెదజల్లడానికి, వ్యక్తి స్వేచ్ఛగానీ, మీడియా స్వేచ్ఛగానీ, వాడుకోవడాన్ని నిర్ద్వంద్వంగా తిరస్కరించాలి. ఈ రోజు సామాజిక మాధ్యమాలు ఇలాంటి విష సంస్కృతి పెరిగిపోయిందని సమాజం ఆందోళన

- మిగతా 2లో..

# అమరావతిపై అబద్ధపు ప్రచారం

(మొదటిపేజీ తరువాయి)
వ్యక్తం చేస్తున్నది. న్యాయ వ్యవస్థ ఆందోళన వ్యక్తం చేస్తున్నది. కట్టడి చేయడానికి అవసరమైన శాసనాలు రూపొందించాలని రాజకీయ పార్టీలకు, చట్టసభలకు విజ్ఞప్తులు విస్తృతంగా అందజేయబడుతున్నాయి.

ఈ నేపథ్యంలోనే స్వతంత్ర నియంత్రణతో వ్యవహరించాల్సిన పత్రికలు, టీవీ ఛానెల్స్ కట్టుతప్పి వ్యవహరిస్తున్నాయనే భావన బలపడుతున్నది. ఏ మీడియాను, వార్తను విశ్వసించలేని సమాజంలోకి మనం నెట్టబడ్డామనే ఆవేదన ప్రజల్లో సర్వత్రా రోజు రోజుకు బలపడుతుంది. దీనికి కారణం వ్యాపార ధోరణి, రాజకీయ పార్టీలు మీడియా సంస్థలను నెలకొల్పుకోవడం లేదా వాటాలు కొనుక్కొని ఆధిపత్యం చెలాయించడం, వ్యాపార ధోరణి - స్వార్థపూరిత రాజకీయ ప్రయోజనాలు ఎప్పుడైతే మీడియా రంగంలో పాతుకుపోయాయో, గుత్తాధిపత్యంలోకి వచ్చాయో సామజికాభివృద్ధి గొడ్డలిపెట్టుకు గురౌతున్నది. అందులో భాగమే ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిపైన జరుగుతున్న ముప్పేట దాడి. అమరావతి చట్టబద్ధమైన, రాజ్యాంగబద్ధమైన రాష్ట్ర రాజధాని. ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానం చేసి, ఎంపిక చేసుకున్నటువంటి రాజధాని. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన చారిత్రాత్మకమైన తీర్పు అమరావతి రాజధానికి రక్షణ కవచంగా నిలిచింది. అమరావతి రాష్ట్రానికి ఏకైక రాజధాని. రాజధాని త్వరితంగా స్థిరమైనటువంటి అభివృద్ధిలో భాగంగా ఆర్థిక నగరంగా, ఆధునిక నగరంగా అమరావతి అభివృద్ధి చెందాలని ఐదు కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలు కలలుకంటున్నారు.

అమరావతి ఏ ఒక్కరిది కాదు. ఢిల్లీ ఏ ఒక్కరిది కాదు. ఇవాళ సమస్యలు ఢిల్లీకి ఉన్నాయి, అమరావతికి ఉన్నాయి. అలాగే, ముంబాయ్, హైదరాబాద్, బెంగుళూర్, చెన్నయ్, నగరాలకు ఉన్నాయి. సమస్యలులేని నగరాలు ఈ దేశంలో లేవా. ఇక్కడ వరదలను గురించి, వరద ముప్పును గురించి మాట్లాడుకుంటున్నాం. నేను కరవు ప్రాంతం నుండి వచ్చా. వర్షపు చినుకుపడితే న శరీరం పులకించిపోతుంది. పరవళు ్తొక్కుతుంది. ఎందుకంటే త్రాగడానికి నీళ్లు దొరకని ప్రాంతంలో పుట్టి, పెరిగి, సామాజిక ఉద్యమాల్లో భాగస్వామిని అయిన వాడిని. వరదలకు హైదరాబాదు, ముంబాయ్, బెంగుళూర్, చెన్నయ్, ప్రపంచంలో అనేక నగరాలు మరియు పట్టణాలు గురవుతున్నాయి. వరదల సమస్యపై గగ్గోలుపెడితే ఆ నగరాల్లో పెట్టుబడులు పెడతారా! ఉపాధి అవకాశాలు వస్తాయా! ఆర్థికాభివృద్ధి జరుగుతుందా అడుగుతున్నా! ఈ రోజు అమరావతిలో నీటి వనరులు ఇవాళ కనిపిస్తున్నాయి. అమరావతిలో పది లక్షల మంది జనాభా పెరిగాక, ఒకవైపు గుంటూరు, మరొక వైపు విజయవాడ పట్టణ జనాభాకు ప్రకాశం బ్యారేజిలో నిల్వచేసే మూడు టిఎంసిల నీళ్లు సరిపోతాయా! ఇవాళ కొండవీటి వాగు, దాని అనుబంధ వాగులు, వాటిలో ప్రవహించే వరద నీరు ఐదు, పది సంవత్సరాల తర్వాత రాజధాని నగరానికి సరిపోతుందా! వరదలకు వణికిపోతున్న చెన్నయ్ నగరానికి శ్రీశైలం నుండి 15 టిఎంసిల కృష్ణా జలాలను తీసుకెళుతున్నారు. బెంగుళూరుకు కావేరి నీరు తెచ్చుకున్నా వేసవిలో రెండు, మూడు రోజులకు ఒకసారి నీటిని సరఫరా చేస్తున్నారు. హైదరాబాదుకు కృష్ణా, గోదావరి, మంజీరా నదుల నుండి యాభై అరవై టిఎంసిలను సరఫరా చేస్తున్నా, నీటి సమస్య ఎదుర్కొంటున్నారు.

అందువల్ల భవిష్యత్తులో అమరావతి నీటి అవసరాలు ఎలా ఉంటాయో ఆలోచించండి. నేడు ఈ వాగుల్లో కనిపిస్తున్న నీటి వనరులు భవిష్యత్తు అవసరాలు తీర్చడానికి ఉంటాయో! లేదో! తీర్చగలవో! లేదోనన్న ఆందోళన నాలాంటి వాళ్లకు కలుగుతున్నది. రాజధాని నగర నీటి సమస్య పరిష్కారానికి, చుట్టుప్రక్కల రైతులకు సాగునీరు అందించడానికి కృష్ణా నదిపై 20 టిఎంసిల నిల్వ సామర్థ్యంతో వైకుంఠాపురం రిజర్వాయరును నిర్మించాలని డిమాండ్ చేస్తున్నా. తద్వారా సముద్రం పాలవుతున్న నీటిని సద్వినియోగం చేసుకోవచ్చు. గడచిన రెండు మాసాల కాలంలోనే 537 టిఎంసిల నీళ్లు ప్రకాశం బ్యారేజీ దాటి సముద్రంలోకి వెళ్లాయి. ఇప్పుడు ఇన్ని నీళ్లు మనకు కనిపిస్తున్నాయి, వేసవి వచ్చే నాటికి విజయవాడలో కూడా స్వేచ్ఛగా నీటిని వాడుకోలేని పరిస్థితులను ప్రజలు ఎదుర్కొంటున్నారు. ఈ దృక్కోణంలో ఆలోచించండి, విమర్శనాత్మకంగా చర్చించండి, ప్రభుత్వానికి చెప్పండి, సూచనలు చేయండి. కొండవీటివాగుతో పాటు ఇతర వాగులు, వంకల్లో ప్రవహించే వరద నీటిని నిల్వ చేసుకుని, వినియోగించుకోవడానికి అవసరమైన రిజర్వాయర్లను ఉపరితలంపైన, వీలైతే భూగర్భంలో (కొన్ని దేశాల్లో నిర్మించిన ఉదాహరణలు ఉన్నాయి) కూడా నిర్మించాలని, ఉన్న చెరువులు, కుంటలను పరిరక్షించాలని పరిశోధనాత్మకమైన కథనాలతో మీడియా ప్రభుత్వానికి సూచించవచ్చు. ఆ పని చేయకుండా వరదల్లో అమరావతి మునిగిపోయిందని గోరంతలు కొండంతలు చేసి గగ్గోలుపెడితే ఎవరైనా వచ్చి పెట్టుబడులు పెడతారా!

సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం కులం పేరుతోనో, మతం పేరుతోనో, ప్రాంతం పేరుతోనో, వరద నీటి పేరుతోనో విషప్రచారం చేస్తూపోతే రాజధాని నగరం ఏవిధంగా అభివృద్ధి చెందుతుందో విజ్ఞతతో ఆలోచించమని కోరుతున్నా. రాయలసీమ గ్రామకక్షలకు, హత్యారాజకీయాలకు నెలవని ఎవరైనా అపవాదువేస్తే, నిర్ద్వందంగా ఖండిస్తుంటాం. అలాంటి నిందలను ఉపేక్షిస్తే ఓర్వకల్లులో, కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలలో ఎవరైనా వచ్చి పెట్టుబడులుపెడతారా! హుదూద్ తుఫాన్ తో అతలాకుతలమైన విశాఖపట్నం తుఫాన్ల ప్రాంతమని దుష్ప్రచారం చేస్తే మన రాష్ట్రానికే గర్వకారణమైన, పారిశ్రామిక - ఆర్థిక - ఉపాధి కల్పన - వెనుకబడ్డ ఉత్తరాంధ్రకు జీవనాడి, తలమానికమైన ఆధునిక నగరం భవిష్యత్తుతో చెలగాటం ఆడడమే కదా!

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి, సంకల్పం ఉన్న వారు సమస్యల పరిష్కారానికి సదుద్దేశంతో నిర్మాణాత్మకమైన సూచనలు చేయాలి. మీడియా బాధ్యతగా వ్యవహరిస్తే ప్రభుత్వాన్ని ఆలోచింప చేయవచ్చు. ప్రభుత్వాలు కొన్నిసార్లు వినిపించుకోకపోవచ్చు, స్పందించకపోవచ్చు, అలాంటి అనుభవాలు కూడా ఉన్నాయి. ప్రభుత్వం పట్టించుకోలేదు కాబట్టి చెప్పడం మానుకోము. గత ప్రభుత్వ కాలంలో చెప్పాం. రాజధానికి కులాన్ని ఆపాదించవద్దని, మూడు ముక్కలాట ఆడవద్దని, చట్టసభ ఏకగ్రీవంగా ఆమోదించిన అమరావతి రాజధానిపై లేని వివాదాన్ని సృష్టించవద్దని చెప్పాం. మాలాంటి వాళ్లపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసినా లెక్కచేయలేదు. ఈ రోజు ఈ ప్రభుత్వానికి కూడా కొన్ని విషయాల్లో చెబుతున్నాం. చెవికెక్కించుకోవడం లేదు. విని, సుపరిపాలన చేస్తే వారికే మంచిది, వినకుండా వారి భవిష్యత్తును వాళ్ళే ప్రశ్నార్థకం చేసుకుంటామంటే అది వారిష్టం. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి వ్యక్తి స్వేచ్ఛ అవసరం, మీడియాకు స్వేచ్ఛ అవసరం. కానీ, దురుద్దేశంతో దుష్ప్రచారం చేయడం కోసం మాత్రం కాదు.

**టి. లక్ష్మీనారాయణ. ప్రముఖ సామాజిక, నీటి రంగ నిపుణులు.**

KUPPAM ENGINEERING COLLEGE
(AUTONOMOUS)
principal@kec.ac.in
www.kec.ac.in
KUPPAM - 517425, ChittoorDt, A.P., (Mob:93938 12267)



No Donation Only Govt Fee
100% Placement Assistance

FEE STRUCTURE: 2025-2026

| Course | Management Seat |
|---|---|
| **Diploma** | |
| DECE | Rs.30,000 |
| DCSE | Rs.30,000 |
| DEEE | Rs.25,000 |
| DMEC | Rs.25,000 |
| D CIVIL | Rs.25,000 |

| Course | Management Seat |
|---|---|
| **B.Tech** | |
| CSE | Rs.1,15,000 |
| AI & ML | Rs.1,20,000 |
| AI | Rs.1,25,000 |
| Data Science | Rs.90,000 |
| ECE | Rs.70,000 |
| EEE | Rs.40,000 |
| MECH | Rs.40,000 |
| CIVIL | Rs.40,000 |

| Course | Management Seat |
|---|---|
| **MBA** | |
| MBA | Rs.40,000 |
| **M.Tech** | |
| Embedded Systems | Rs.50,000 |
| VLSI | Rs.50,000 |
| Power Electronics | Rs.50,000 |
| Machine Design | Rs.50,000 |
| Computer Science | Rs.60,000 |

Salary Packege Ranges From 4 LPA to 16 LPA

Hostel Fee (Per year): Diploma Course Rs.40,000 B.Tech, M.Tech & MBA Courses Rs.59,000
(Inclusive of food and accommodation)

For Admissions Contact: 6303912518, 08570256988, 6303912517

# కృష్ణమ్మ తల్లిని నా కుప్పానికి తీసుకొచ్చా






(మొదటిపేజీ తరువాయి)

కృష్ణమ్మ తరలి వచ్చింది. 2014-19 మధ్య సీమలో ఇరిగేషన్ ప్రాజెక్టులపై రూ.12,441 కోట్లు ఖర్చు పెట్టాం. వైసీపీ కేవలం రూ.2 వేల కోట్లు మాత్రమే ఖర్చు పెట్టింది. ఎన్నికల ముందు గేట్లతో సెట్టింగులు వేసి డ్రామాలాడారు. నీళ్లు కూడా బయట నుంచి తెచ్చి వదిలారు. వారు విమానం ఎక్కేలోగానే ఆ నీరు ఇంకిపోయింది. అబద్ధాలు చెప్పడంలో వైసీపీ దిట్ట. అసాధ్యాలు సుసాధ్యం చేయడంలో ఎన్డీఏ దిట్ట. నేను వెళ్లేలోగా నీరు ఇంకిపోతుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ప్రతి చెరువుకు నీరిచ్చే బాధ్యత నాది." అని సీఎం హామీ ఇచ్చారు.

**టీడీపీకి నీటి విలువ తెలుసు**

"నీటి విలువ తెలిసిన పార్టీ తెలుగుదేశం. వైసీపీ లాంటి పార్టీలకు నీటి విలువ, రైతు సమస్యలు ఎప్పటికీ తెలియవు. 100 రోజుల కార్యాచరణ లక్ష్యంతో రూ.3,850 కోట్లు మంజూరు చేశాం. కాల్వలు వెడల్పు చేశాం. నాలుగు నెలల్లో 40 టీఎంసీల నీరు తెచ్చాం. పది రిజర్వాయర్లను నింపాం. చెరువులను నింపుతున్నాం. సీమ జిల్లాల్లో 6 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీరు అందుతుంది. పరిశ్రమలకు కూడా నీరు లభిస్తుంది. వచ్చే ఏడాదికి చిత్తూరు చివరి భూములకు కూడా నీరందిస్తాం. పీలేరు, పుంగనూరు, చంద్రగిరి, పూతలపట్టు, చిత్తూరు, జీడీ నెల్లూరు నియోజకవర్గాల ప్రజలకు దీంతో ప్రయోజనం కలుగుతుంది. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు ద్వారా వంశధార-పెన్నా నదుల అనుసంధానం చేయవచ్చు. ఇదే జరిగితే రాయలసీమకే కాదు.. రెండు తెలుగు రాష్ట్రాలకు శాశ్వతంగా కరవు అనేదే ఉండదు. తెలంగాణ ప్రజలు, నేతలు కూడా నదుల అనుసంధానం వల్ల కలిగే ప్రయోజనాలను అర్థం చేసుకోవాలి. నా 45 ఏళ్ల రాజకీయ జీవితంలో నీటి నిర్వహణపైనే దృష్టి పెట్టాను. నీరు-మీరు, నీరు-చెట్టు, చెక్ డ్యాములు, సాగు నీటి సంఘాలు, వాటర్ షెడ్లు అంటూ నీటి నిర్వహణ కోసం ప్రయత్నించాను. పరుగెత్తే నీటిని నడిపించాలి... నడిచే నీటిని నిలపాలనే సూత్రంతో పనిచేశాను. కుప్పం సహా సీమలోని ప్రతి చెరువునూ నింపుతాం. చెరువులను నింపితే... వర్షాభావ పరిస్థితులు వచ్చినా తట్టుకోగలం" అని సీఎం అన్నారు.

**రాక్షసుల్లా అడ్డు పడుతున్నారు**

"రాష్ట్రాభివృద్ధికి యజ్ఞం చేస్తుంటే... కొందరు రాక్షసుల్లా అడుగడుగునా అడ్డుపడుతున్నారు. తప్పుడు ప్రచారాలతో ప్రతి మంచి పనికీ అడ్డంకులు సృష్టిస్తున్నారు. చేతనైతే అభివృద్ధి, సంక్షేమంలో పోటీ పడాలి. మొన్నటి ఎన్నికల్లో సీమ ప్రజలు 52 సీట్లకు గాను వాళ్లకు 7 ఎమ్మెల్యే సీట్లు ఇచ్చినా వారికి బుద్ధి రాలేదు. ప్రతిపక్షం అని చెప్పుకుంటున్న వైసీపీ విషవృక్షంలా తయారైంది. తన ఉనికి చాటుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. అయితే వారి కుట్రలకు కాలం చెల్లింది. ప్రజలు చైతన్యంతో కుట్రలు బద్దలు కొడుతున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి కుప్పంలో తెలుగుదేశాన్నే గెలిపిస్తున్నారు. ప్రశాంతంగా ఉన్న కుప్పంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించాలని ప్రయత్నించారు. రప్పా రప్పా రాజకీయం చేస్తామని బహిరంగంగానే ప్రకటిస్తున్నారు. పులివెందుల, ఒంటిమిట్ట ఎన్నికల్లో రప్పా రప్పా రాజకీయం ఎలా ఉంటుందో... ప్రజలే వారికి చూపించారు. ఎన్ని అడ్డంకులు కల్పించినా... ఇబ్బందులు సృష్టించినా.. అభివృద్ధి చేస్తున్నాం.. సంక్షేమమూ చేపడుతున్నాం." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**ఆటో డ్రైవర్లకూ అండగా ఉంటాం**

"ఉచిత బస్సు ప్రయాణంతో ఆడబిడ్డలంతా సంతోషంగా ఉన్నారు. స్త్రీ శక్తితో ఆటో డ్రైవర్లు ఇబ్బంది పడకుండా చూస్తాం. వారిని కూడా ఆదుకుంటాం. ఆటో డ్రైవర్లకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేస్తాం. మెగా డీఎస్సీ ద్వారా టీచర్ల రిక్రూట్మెంట్ చేపడుతున్నాం. కుప్పం నుంచి కూడా 50 మంది టీచర్లు ఎంపికయ్యారు. కుప్పం నియోజకవర్గానికి ఒకప్పుడు టీచర్లే వచ్చే వారు కారు.. ట్రాన్సఫర్లు చేయించుకుని వెళ్లిపోయేవారు. కానీ ఇప్పుడు కుప్పం యువతీ, యువకులే టీచర్లయ్యారు. తల్లికి వందనం అందరికీ ఇస్తున్నాం. అన్నదాత సుఖీభవ ద్వారా రైతులను ఆదుకుంటున్నాం. అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశాం. పెన్షన్లు ఇస్తున్నాం. దీపం పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. ఇలా ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ పాలన చేస్తున్నాం. కుప్పానికి 12 పరిశ్రమలు వచ్చాయి.

రూ.3908 కోట్లు పెట్టుబడులు, 15600 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు, 26581 మందికి పరోక్ష ఉపాధి లభిస్తుంది. ఐ-ఫోన్ ఛాసిస్ ఉత్పత్తి చేసేలా హిందాల్కో సంస్థ యూనిట్టును ప్రారంభించబోతోంది. కుప్పాన్ని ఇతర రాష్ట్రాలకు కనెక్ట్ చేస్తూ పెద్ద ఎత్తున రహదారుల నిర్మాణం జరుగుతోంది. ప్రపంచంలోని టెక్నాలజీనంతా కుప్పానికి తెస్తాను." అని చంద్రబాబు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మల, చిత్తూరు జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

**కుప్పంలో సీఎం పర్యటన సైడ్ లైట్స్**

చంద్రబాబు జలహారతి ఇస్తున్న సమయంలోనే కుప్పంలోని మొత్తం 60కు పైగా ప్రాంతాల్లో జలహారతులు కుప్పం ప్రజలు ఇచ్చారు. కుప్పంలోని తన నివాసం నుంచి ఆర్టీసీ బస్సులో ముఖ్యమంత్రి ప్రయాణించారు. మహిళలు, రైతులతో కలిసి స్త్రీ శక్తి బస్సులో సీఎం వెళ్లారు. కుప్పం బ్రాంచ్ కెనాల్ వరకు మహిళలు, రైతులతో సంభాషిస్తూ బస్సులో సీఎం ప్రయాణించారు. స్త్రీ శక్తి పేరుతో అందిస్తున్న ఉచిత బస్సు సదుపాయం ఎలా ఉందని మహిళలను అడిగిన చంద్రబాబు.... తాము ఎక్కడికి వెళ్లినా ఇబ్బంది లేకుండా... ఫ్రీ బస్సులో వెళు_న్నామని మహిళలు చెప్పారు. హంద్రీ-నీవా నీళ్లు తొలిసారి కుప్పానికి వచ్చాయి.. కాల్వల్లో నీళ్లు చూశారా..? చెరువులు నిండాయా అంటూ చంద్రబాబు ఆరా తీశారు. తొలిసారి కుప్పానికి కృష్ణమ్మ వచ్చిందని... చాలా సంతోషంగా ఉందని రైతులు, మహిళలు చెప్పారు. ఇక సభకు హాజరయ్యే ముందు బోటులో పరమ సముద్రం చెరువులోకి వెళ్లి చెరువును పరిశీలించారు. ఇక సభలో 2014-19 మధ్య అసెంబ్లీలో సాగునీటి రంగంపై జరిగిన చర్చ వీడియోను సీఎం చంద్రబాబు ప్రదర్శించారు. నాడు ప్రతి నియోజకవర్గానికి నీళ్లిస్తామని సభలో చంద్రబాబు ప్రకటించిన వీడియోను పొందుపరిచారు. జగన్ అడ్డంగా పడుకున్నా... నీళ్లిచ్చి తీరతామంటూ నాడు సభలో నాడు చంద్రబాబు స్పష్టం చేస్తూ ప్రకటన వీడియో చూసిన సభికులు చప్పట్లతో సభా ప్రాంగణాన్ని మార్మోగించారు. ఈ సందర్భంగా వైసీపీ తీరును సభలో సీఎం ఎండగట్టారు. పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను తరలించి.. కృష్ణా జలాలను సీమకు తీసుకువచ్చే ప్రయత్నం చేశామని నాడు సభలో జరిగిన చర్చను చంద్రబాబు వివరించారు. పట్టిసీమకు అడ్డుపడే ప్రయత్నం చేశారని వైసీపీ తీరును చంద్రబాబు దుయ్యబట్టారు. 2019 మధ్య కాలంలో వైసీపీ ప్రభుత్వ నిర్వాకం వల్ల సీమకు నీరు చేరలేదని ముఖ్యమంత్రి వెల్లడించారు. కుప్పం బ్రాంచ్ కెనాల్ వద్ద ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ను ముఖ్యమంత్రి సందర్శించారు. రిజర్వాయర్లల్లో నీరు ఏ విధంగా నింపుతున్నాం.. ప్రవాహాలు వస్తున్న తీరును జనానికి అర్థమయ్యేలా సీసీ కెమెరాల ద్వారా లైవులో చూపించే ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. నీటి విలువ, ఇరిగేషన్ కోసం ఎంత ఖర్చు పెడుతున్నామనే అంశాలను, ఎన్ని రోజుల్లో నీటిని తరలించామనే విషయాలను వివరిస్తూ లైవ్ డెమానిస్ట్రేషన్ ఇవ్వాలని సీఎం సూచించారు. హంద్రీ-నీవా కాల్వ విస్తరణ పనుల పైలాన్ ను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు.

















## చైనాలో మోదీకి ఘన స్వాగతం

- 'వందేమాతరం' నినాదాలతో హోరెత్తిన విమానాశ్రయం
- షాంఘై సదస్సు కోసం చైనాలోని టియాంజిన్‌కు చేరుకున్న ప్రధాని మోదీ
- విమానాశ్రయంలో ఘనంగా స్వాగతం పలికిన ప్రవాస భారతీయులు
- 'వందేమాతరం', 'భారత్ మాతా కీ జై' నినాదాలతో మార్మోగిన పరిసరాలు
- ఆదివారం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో మోదీ భేటీ
- సోమవారం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో కీలక సమావేశం
- సరిహద్దు ఉద్రిక్తతల తర్వాత జిన్‌పింగ్‌తో భేటీకి పెరిగిన ప్రాధాన్యం

**చైనా - ఆంధ్రనాడు, ఆగస్టు 30:**

షాంఘై సహకార సంస్థ (ఎస్సీవో) శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు చైనాకు చేరుకున్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఘన స్వాగతం లభించింది. శనివారం సాయంత్రం టియాంజిన్‌లోని బిన్హాయ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు అక్కడ నివసిస్తున్న ప్రవాస భారతీయులు బ్రహ్మరథం పట్టారు. భారతీయ సంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఆయన్ను ఆహ్వానించారు. 'వందేమాతరం', 'భారత్ మాతా కీ జై' అంటూ దేశభక్తి నినాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది.

జపాన్ పర్యటన ముగించుకుని నేరుగా చైనాకు వచ్చిన ప్రధానమంత్రి మోదీ, ప్రవాస భారతీయుల ఆత్మీయ స్వాగతంపై సంతోషం వ్యక్తం చేశారు. "చైనాలోని భారత సమాజం టియాంజిన్‌లో ఎంతో ప్రత్యేకమైన స్వాగతం పలికింది" అని ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా తెలియజేశారు. ఎస్సీవో సదస్సులో భాగంగా వివిధ దేశాల అధినేతలతో లోతైన చర్చలు జరపనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆదివారం నుంచి రెండు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో ప్రధానమంత్రి మోదీ కీలక ప్రసంగం చేయనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన పలువురు ప్రపంచ నేతలతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించనున్నారు. ముఖ్యంగా ఆదివారం నాడు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో, సోమవారం నాడు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రధానమంత్రి మోదీ సమావేశం కానుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

## వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ పురస్కారం అందుకున్న బాలయ్య...

- హాజరైన బండి సంజయ్, నారా లోకేశ్
- భారత సినీ చరిత్రలో బాలయ్య సరికొత్త రికార్డ్
- వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు
- 50 ఏళ్ల సినీ ప్రస్థానానికి గాను దక్కిన ప్రతిష్ఠాత్మక అవార్డు

**హైదరాబాద్ - ఆంధ్రనాడు, ఆగస్టు 30:** ప్రముఖ నటుడు, హిందూపురం శాసనసభ్యుడు బాలకృష్ణ తన సినీ జీవితంలో ఒక అరుదైన మైలురాయిని అందుకున్నారు. ఆయన ప్రతిష్ఠాత్మకమైన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ (గోల్డ్ ఎడిషన్)లో స్థానం సంపాదించారు. భారత చలన చిత్ర పరిశ్రమ నుంచి ఈ పురస్కారానికి ఎంపికైన తొలి నటుడిగా ఆయన అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. 50 ఏళ్లుగా చిత్ర పరిశ్రమకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా బాలకృష్ణకు ఈ గౌరవం దక్కింది. హైదరాబాద్‌లో వైభవంగా జరిగిన ఒక కార్యక్రమంలో బాలకృష్ణ ఈ పురస్కారాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, ఆంధ్రప్రదేశ్ ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారి చేతుల మీదుగా బాలకృష్ణ ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ బాలకృష్ణపై ప్రశంసల వర్షం కురిపించారు. "ఒక చరిత్ర రాయాలన్నా, దాన్ని తిరిగి రాయాలన్నా అది ఒక్క బాలయ్య బాబుతోనే సాధ్యం. ఆయన అందరికీ బాలయ్య అయితే, నాకు మాత్రం ముద్దుల మావయ్య" అని అన్నారు. 50 ఏళ్లుగా సినిమా, రాజకీయ రంగాలలో ఆయన తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని లోకేశ్ కొనియాడారు.

బాలకృష్ణ ఎప్పుడూ యంగ్ అండ్ ఎనర్జిటిక్‌గా ఉంటారని, ఆయన సినీ ప్రస్థానంలో చారిత్రక, జానపద, ఆధ్యాత్మికం, సైన్స్ ఫిక్షన్ వంటి ఎన్నో విభిన్న జానర్లలో నటించి మెప్పించారని గుర్తుచేశారు. "బాలయ్య బాబుది భోళాశంకరుడి మనస్తత్వం, అందుకే సినీ పరిశ్రమ ఆయన్ను అంతగా ప్రేమిస్తుంది. బసవతారకం ఆసుపత్రి ఆయనలోని మానవత్వానికి నిదర్శనం. ఓటీటీలో కూడా 'అన్‌స్టాపబుల్' అంటూ అద్భుతంగా రాణించారు. ఆయనకు ఈ పురస్కారం రావడం తెలుగు జాతికి గర్వకారణం" అని లోకేశ్ పేర్కొన్నారు.

## కూటమి 15 ఏళ్లు కొనసాగాలి...

(మొదటిపేజీ తరువాయి)

రాబోయే పదేళ్లలో యువతను బలమైన నాయకులుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని, 2030 నాటికి అనేకమంది శక్తివంతమైన నాయకులను రాష్ట్రానికి అందిస్తానని హామీ ఇచ్చారు. పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న వీరమహిళలకు సముచిత స్థానం కల్పిస్తామని, పార్టీ పదవుల్లో వారికి 33 శాతం కేటాయిస్తామని ప్రకటించారు. క్రమశిక్షణ, అంకితభావం, స్థిరత్వం ఉంటే ఎవరైనా ఉన్నత స్థాయికి ఎదగవచ్చని యువతకు పిలుపునిచ్చారు.

**కూటమి పటిష్ఠంగా ఉండాలి**

ప్రస్తుత కూటమి ప్రభుత్వ స్థిరత్వంపై పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. "మనం బలహీనపడితే రాష్ట్రంలో మళ్లీ అరాచక పాలన వస్తుంది. కాబట్టి ఈ కూటమి చాలా కాలం కొనసాగాలి. రాష్ట్రానికి వచ్చే 15 ఏళ్ల పాటు రాజకీయ స్థిరత్వం చాలా అవసరం" అని ఆయన అభిప్రాయపడ్డారు. భాగస్వామ్య పక్షాల మధ్య చిన్న చిన్న సమస్యలు తలెత్తితే వాటిని సామరస్యంగా చర్చించుకుని పరిష్కరించుకోవాలని సూచించారు. 2019-24 మధ్య కాలంలో తమ పార్టీ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నా, ఎన్నడూ ప్రధాని లేదా హోంమంత్రి సహాయం కోరలేదని, ఆత్మగౌరవంతోనే నిలబడ్డామని గుర్తుచేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో హింసకు తావులేదని, తాను విప్లవ మార్గాన్ని ఎంచుకోలేదని పవన్ పేర్కొన్నారు. రాజకీయాలంటే వ్యాపారం కాదని, ప్రజాసేవ అని నమ్మి నిస్వార్థంగా పనిచేస్తున్నందునే మంచి ఫలితాలు వస్తున్నాయని ఆయన కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సభ జనసేన శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపడంతో పాటు, పార్టీ భవిష్యత్ ప్రయాణంపై ఒక స్పష్టమైన మార్గదర్శినిగా నిలిచింది.

## వైసీపీ మాటలు హాస్యాస్పదం

**- మంత్రి అనగాని సత్యప్రసాద్**

**అమరావతి - ఆంధ్రనాడు, ఆగస్టు 30:** రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడటం, ప్రజలకు న్యాయం చేయడం కూటమి ప్రభుత్వం లక్ష్యమని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. వైసిపి నేతలు శాంతిభద్రతల గురించి మాట్లాడటం హాస్యాస్పదమని శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో సొంత తల్లి, చెల్లి, కుటుంబ సభ్యులకు రక్షణ లేక రాష్ట్రం వదిలిపోయారని పేర్కొన్నారు. సొంత పార్టీ ఎంపి కుటుంబాన్ని కిడ్నాప్ చేసి 48 గంటలు దాచిన చరిత్ర అని విమర్శించారు. కాకాణి గోవర్ధన్ రెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి, పేర్ని నాని వంటి వైసిపి నాయకుల రాజకీయ జీవితం ఎప్పుడో ముగిసిపోయిందని పేర్కొన్నారు. రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ తీసుకురాలేని వైసిపి నేత కూడా మాట్లాడుతుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లడమే వారి రోజువారీ కార్యక్రమం అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలి

**- నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి, వలసలు నివారించాలి**
**- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్**




**మదనపల్లి -ఆంధ్రనాడు, ఆగష్టు 30:** అన్నమయ్య జిల్లా సమగ్రాభివృద్ధికి 10 వేల కోట్లు కేటాయించాలని,నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి,వలసలు నివారించాలని,మదనపల్లి జిల్లాగా రాజంపేటలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించాలని, ఆటో డ్రైవర్లకు ఈయస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఫ్రీ బస్ పథకంతో ఉపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సంతగేటులోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఏఐటీయూసీ నాయకుల సమావేశం జరిగింది.ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ జిల్లా ఏర్పడి మూడు సంవత్సరాలు దాటినా నేటికీ జిల్లాలో ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు చేయలేదని ఆరోపించారు.సెప్టెంబర్ 1న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజంపేట వస్తున్న సందర్భంగా జిల్లాలో నూతన పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి,వలసలు నివారించడానికి కృషి చేయాలని కోరారు.మూతపడిన పరిశ్రమల స్థానంలో ప్రయత్నాయ పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.అన్నమయ్య జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రత్యేక నిధులు రూ.10 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.ఎన్నికల సందర్భంగా మదనపల్లి జిల్లా ఏర్పాటు చేస్తామన్న హామీ మేరకు మదనపల్లి జిల్లాగా ప్రకటించాలని కోరారు.ఆటో,హమాలీ వర్కర్స్ కు ఈయస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని,ఫ్రీ బస్ పథకంతో ఉపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని,జీవో నెంబర్ 21,31 రద్దు చేయాలని,ఆటో డ్రైవర్లకు వాహనమిత్ర పథకం అమలు చేయాలని,ఎఫ్ సి సేవలు మదనపల్లి ఆర్టీవో కార్యాలయాలలోనే కొనసాగించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.మదనపల్లి మున్సిపాలిటీతోపాటు ఇతర మున్సిపాలిటీలో జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని, పనిభారం తగ్గించాలని కాంట్రాక్టు,ఔట్ సోర్సింగ్ వర్కర్స్ ను రెగ్యులరైజ్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు.తెగిపోయిన అన్నమయ్య ప్రాజెక్టు పునఃనిర్మించాలని హంద్రీ-నీవా జలాలు ద్వారా చెరువులు నింపాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మదనపల్లి నియోజకవర్గ కార్యదర్శి ముబారక్,ఏఐటీయూసీ మదనపల్లి పట్టణ కార్యదర్శి తిరుమల,సీపీఐ మదనపల్లి పట్టణ కార్యదర్శి మాధవ్,ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు ,ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పంటలను ధ్వంసం చేసిన ఏనుగులు



**పలమనేరు-ఆంధ్రానాడు,ఆగష్టు 30:** పలమనేరు రూరల్ మండలం బయ్యప్పగారిపల్లి పంచాయతీ దొమ్మం`పా పమ్మ గుడికి పడమర వైపున ఉన్న పూసరపెంట గ్రామానికి చెందిన రైతుల పంటలు శనివారం వేకువ జామున ఏనుగులు ధ్వంసం చేశాయని రైతులు వాపోయారు.గ్రామానికి చెందిన బొజ్జన్న బాబు నాయుడు అనే రైతుకు చెందిన అర్ధం ఎకరం వరిపంటతోపాటు అరటి చెట్లను కూడా ధ్వంసం చేసి నష్టపరిచాయి. అదేవిధంగా పక్కనున్న మహేశ్వరి అనే రైతుకు చెందిన ఎకరాపైన వరి పంటను ధ్వంసం చేసి నష్టంచేశాయి. రెండురోజుల క్రితం కూడా మహేశ్వరి పొలంలోకి వచ్చి వరిపంటను నష్టపరిచి పొలంలో నివాసం ఉంటున్న ఇంటి పక్కన పశువుల షెడ్డును తొండంతో కొట్టి భయభ్రాంతులకు గురి చేసింది.ఈ శబ్దానికి కుక్కలు అరవడంతో మేల్కొని కేకలు వేయడంతో ఏనుగులు వెళ్ళిపోతాయని తెలిపారు.ఇంకనూ అరుణాచలం అనే రైతుకు చెందిన కోత దశలో ఉన్న టమేటా పంటను కూడా ధ్వంసం చేసి నష్టపరిచాయని తెలిపారు.ఈ ప్రాంతం అడవికి ఆనుకుని ఉన్నందున అప్పుడప్పుడు వచ్చి పంటలను నష్టపరుస్తూనే ఉన్నాయి. రైతులు పూర్తిగా నష్టపోతున్నారు. ఏనుగుల వలన పొలాల వద్ద నివాసముంటున్న ఇళ్ళపై ఎప్పుడు దాడి చేస్తాయో అని రాత్రిళ్ళు జాగారం చేస్తూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రాణ భయంతో భయభ్రాంతులకు గురౌతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఏనుగులు పంటపొలాలపై రాకుండా తగు చర్యల కొరకు పెండింగ్ లో వున్న ఇందిరానగర్ కాలనీకి నుంచి గుడి యాత్రం రోడ్డు మీదుగా కాలవపల్లి దాటి చెత్తపెంట గ్రామం వరకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేపట్టాలని అటవీ సమీపాన గల మొసలి మడుగు,కాలువపల్లి, పూసరపెంట గ్రామస్తులు రైతులు కోరుతున్నారు

## విశ్వం స్కూల్లో యూఎస్ఓ ఇంటర్ స్కూల్స్ ఫెస్ట్-2025 సమాచార పత్రికావిష్కరణ




**తిరుపతి-ఆంధ్రనాడు, ఆగష్టు 30:** తిరుపతి వరదరాజనగర్ లోని విశ్వం సైనిక్ నవోదయ పోటీ పరీక్షల కేంద్రంలో యూ.ఎస్.ఓ ఇంటర్ స్కూల్స్ ఫెస్ట్-2025 సమాచార పత్రిక యూఎస్ఓ వైస్ ప్రెసిడెంట్ కే.వి.త్యాగరాజన్ మరియు విశ్వం విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ ఎన్. విశ్వచందన్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో యూ.ఎస్.ఓ వైస్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ.... సెప్టెంబర్ 22న జీవకోనలోని విశ్వం హై స్కూల్ వేదికగా యునైటెడ్ స్కూల్స్ ఆర్గనైజేషన్ ఇంటర్ స్కూల్స్ ఫెస్ట్- 2025 నిర్వహిం చబడనుంది అని ఈ ఫెస్ట్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 6వ తరగతి నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను కనబర్చ వచ్చున్నారు. చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు, జానపద నృత్యం, నాటక ప్రదర్శన,విజ్ఞాన ప్రదర్శన వంటి అంశాలపై పోటీలు ఉండనున్నాయి అని తెలిపారు.ఈ సందర్భంగా విశ్వం విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్ రెడ్డి మాట్లా డుతూ.. "యూ.ఎస్.ఓ. ఇంటర్ స్కూల్స్ ఫెస్ట్ విద్యార్థుల ప్రతిభను వెలుగులోకి తేవడంతో పాటు విజ్ఞానం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి గొప్ప వేదిక" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూ ఎస్ఓ సభ్యులు డాఎటి.శ్రీనాథ శర్మ, ఎం.వెంకటరమణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## స్వామి వారి నిత్య అన్నదానానికి రూ.25 లక్షల విరాళం

**- విరాళం ఆలయ ఈవో పెంచల కిషోర్‌కి అందజేస్తున్న దాతలు గుమ్మడి అన్వేష్ కుటుంబ సభ్యులు**



**కాణిపాకం- ఆంధ్రనాడు, ఆగష్టు 30 :** స్వామివారి నిత్య అన్నదానం కి 25 లక్షలు విరాళం. కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం నిత్య అన్నదా నానికి భారీ విరాళం (25 లక్షలు) రూపాయలు, దాత గుమ్మడి అన్వేష్ వారి కుటుంబ సభ్యులు, విజయవాడ వాస్తవ్యులు, ఆలయ అధికారులు వీరికి దర్శన ఏర్పాట్లు చేసి అనంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులచే ఆశీర్వాదం చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేసిన దేవస్థానం ఈ.వోపెంచల కిషోర్, ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపర్డెంట్ వాసు, సిఎఫ్ఓ నాగేశ్వరరావు, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## గణనాథుడి బ్రహ్మోత్సవాలకు పట్టు వస్త్రాలు సమర్పణ

**కాణిపాకం-ఆంధ్రనాడు, ఆగష్టు 30 :** విజయవాడ ఇంద్ర కీలాద్రి దుర్గ అమ్మవారి దేవస్థానం నుండి స్వామివారికి సాంప్రదాయంగా పట్టు వస్త్రాలను సమర్పించిన దేవస్థానం ఈవో. కాణిపాకం శ్రీ వరసిద్ది వినాయక స్వామివారి వార్షిక బ్రహ్మోత్స వాలలో భాగంగా శనివారం విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గ అమ్మవారి దేవస్థానం నుండి స్వామివారికి సాంప్రదాయంగా పట్టు వస్త్రాలను సమర్పించిన విజయవాడ దేవస్థానం ఈ.వో శీనానాయక్, ప్రధాన అర్చకులు దుర్గాప్రసాద్ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించడం జరిగింది, వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేసిన దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్, ఈ కార్యక్రమంలో ఏఈవోలు ఎస్ వి కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, ధనంజయ, ధనపాల్, సూపర్డెంట్లు కోదండపాణి, వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.



## కిలాకీపోడులో హంద్రీనీవా జలాలకు పూజలు





**రామకుప్పం -ఆంధ్రనాడు, ఆగష్టు 30:** రామకుప్పం మండలం కిలాకీ పోడు వద్ద శనివారం తెలుగుదేశం పార్టీ నాయకులు హం ద్రీనీవా జలాలకు పుష్పాభిషేకంతో స్వాగతం పలికారు కుప్పం నియోజకవర్గంలో పలుచోట్ల హంద్రీనీవా జలాలకు పూజలు చేయాలని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు దానితో తెలుగుదేశం పార్టీ నాయకులు ఆయా మండలాల్లో పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా కాలువలోకి నీరు రావడం తర్వాత దశలవారీగా చెరువు లకు నిండుతుంది దీనితో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మాజీ జెడ్పిటిసి, మునుస్వామి తెలుగుదేశం పార్టీ నాయకులు రామమూర్తి పట్ట నారాయణ జయశంకర్ చలం వైస్ ఎంపీపీ వెంకట్రామ గౌడ్ , కుమార్,ఇంత పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా గణేష్ నిమజ్జనం



**రామకుప్పం -ఆంధ్రనాడు, ఆగష్టు 30:** రామకుప్పంలో పలు వీధులలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలను శనివారం నిమజ్జనం చేశారు వినాయక విగ్రహాలను రామకుప్పంలో ఊరేగింపుగా డప్పు వాయిద్యాలతో యువకులు రంగురంగులు చెల్లుకొని నృత్యాలు5 చేశారు జై జై గణేశా బోలో గణేష్ మహారాజ్‌కి అనినినాదాలు చేశారు పలువురు స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు కొందరు ప్రసాద వితరణ చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## మూషిక వాహనంపై భక్తులకు దర్శనమిచ్చిన ఘననాథుడు

**కాణిపాకం- ఆంధ్రనాడు, ఆగష్టు 30 :** కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంలో జరుగుతున్న స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి మూషిక వాహనంపై కానిపాకం గ్రామ పురవీధులలో విహ రిస్తూ భక్తులకు దర్శనం ఇచ్చిన గణనాథుడు. కాణిపాకం తిరవణం పల్లి, అగరంపల్లి, కాణిపాకపట్నం, వడ్రంపల్లి, కొత్తపల్లి, చినకాంపల్లి, గ్రామాల విశ్వకర్మ వంశస్థులు ఉభయదారులగా వ్యవహరించారు. ఈ మేరకు వారు ఉదయం వరుస తీసుకురాగా అర్చక స్వాములు స్వామివారి మూలవిరాట్ కు పంచామృతం అభిషేకం నిర్వహించి చక్కగా అలంకరించి ధూప దీప నైవేద్యములను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే రాత్రి స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకార మండపంలో వేద పండితుల మంత్రోచ్ఛారణ నడుమ అర్చకులు పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకరించి మూషిక వాహనంపై స్వామి అమ్మవార్లను ఉంచి మంగళ వాయిద్యాలు వివిధ సాంస్కృతిక ప్రదర్శన నడుమ ఘనంగా గ్రామ మాడ వీధుల గుండా ఘనంగా ఊరేగింపును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో పెంచల కిషోర్, డిప్యూటీ ఈవో సాగర్ బాబు, ఏఈ ఓ రవీంద్రబాబు, సూపర్డెంట్ కోదండ పాణి , వాసు,టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, చిట్టిబాబు, ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, వీరితోపాటు ఉభయ దారులు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## మదనపల్లి అభివృద్ధికి

# కూటమి ప్రభుత్వం చేసింది శూన్యం

### - వైకాపా సమన్వయకర్త నిస్సార్ అహ్మద్



మదనపల్లి- ఆంధ్రనాడు, ఆగష్టు 30: మదనపల్లి అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చేసింది శూన్యమని వైకాపా సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ విమర్శించారు. శనివారం పట్టణంలోని 9వ వార్డులో కౌన్సిలర్,వైసిపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు పాల్ చంద్రశేఖర్,8వ వార్డులో ఇంచార్జి నవాజ్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిస్సార్ అహ్మద్ తోపాటు ఏపీ ఎండిసి మాజీ చైర్ పర్సన్ షమీం అస్లాం, మునిసిఫల్ చైర్ పర్సన్ వి.మనూజా రెడ్డి,మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వీఎస్ రెడ్డిలు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన, పట్టణంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని, అభివృద్ధి పనులు కేవలం శంకుస్థాపనలకే పరిమితమవుతున్నాయన్నారు. కూటమి నాయకులు చెప్పేది కొండంత చేసేది గోరంతా అని ఎద్దేవా చేశారు. అనంతరం 9వవార్డ్ కౌన్సిలర్ పాల్ చంద్రశేఖర్ మాటాడుతూ... గత ఐదేళ్ల వైసిపి పాలన అద్భుతంగా సాగిందని, ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేయడం జరిగిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి వాలంటీర్ వ్యవస్థ,సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందజేశారని,



తద్వారా ప్రజల జీవితాల్లో ఆనందం నింపారని కొనియాడారు. అదేవిధంగా మున్సిపాలిటీలో అన్ని వార్డులకు సమానంగా నిధులు కేటాయించి,మౌలిక సదుపాయాలు కల్పనకు పెద్దపీట వేయడం జరిగి ందన్నారు. గతంలో నవరత్నాలను కుల, మత, రాజకీయాలకు అతీతంగా వైసీపీ ప్రభుత్వం అందజేస్తే,నేడు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల అమలులో కోతలు విధిస్తోందన్నారు.దాదాపు లక్ష మంది దివ్యాంగులకు పింఛన్లను తొలగించడమే ఇందుకు నిదర్శన మన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనకు కూటమి ప్రభుత్వ పాలనకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. ఏడాదిలోనే ప్రజలు ఆ ఈ పరిపాలన గమనించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, కార్య కర్తలు తదితరులు పాల్గొన్నారు.

# హత్యాయత్నం కేసులు నమోదు చేయాలి

### - సీపీఐ, డిహెచ్‌పీఎస్ డిమాండ్

**మదనపల్లి -ఆంధ్రనాడు, ఆగష్టు 30:**

భూమి వివాదంపై ఆక్రోశంతో దాయాదులపై విచక్షణ రహితంగా దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన ములకలచెరువు మండలం బురకాయలకోట గ్రామానికి చెందిన భాస్కర్, గంగాద్రి, ఆదిలక్ష్మి, భవానీ ప్రసాద్ తదితరులపై కిడ్నాప్, హత్యాయత్నం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ), దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్పిఎస్) డిమాండ్ చేశాయి.ఈ నేపథ్యంలో మదనపల్లి జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు కంటి రామచంద్ర, మంచాల భారతీయుడు,మంచాల హరికుమార్‌లను సిపిఐ అన్నమయ్య జిల్లా సహాయ కార్యదర్శి తోపు కృష్ణప్ప, నియోజకవర్గ కార్యదర్శి మురళి,డిహెచ్పిఎస్ జిల్లా కార్యదర్శి మండెం సుధీర్ కుమార్ పరామర్శించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కురబలకోట మండలం ముదివేడు గ్రామ సర్వే నంబర్లు 401/2, 401/5, 1601/2 ఏ,183/1,255/2లో ఉన్న ఎనిమిది ఎకరాల 26 సెంట్ల భూమి కంటి రెడ్డమ్మ,లేట్ కంటి



వెంకటరమణ పేర్లపై ఉందని,దీనిపై దాయాదులు నిరంతరం గొడవలు పెట్టి పలుమార్లు దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు.మదనపల్లి కోర్టు,అనంతరం హైకోర్టు తీర్పులు కంటి రెడ్డమ్మకు అనుకూలంగా రావడంతో ఆగ్రహానికి గురైన నిందితులు శనివారం తెల్లవారుజామున బాధితులపై దాడి చేపట్టారని వారు వివరించారు.రామచంద్రను మంచంతో సహా లేపి తీసుకెళ్లి చంపే ప్రయత్నం చేసిన సమయంలో ఇతరులు అడ్డుకోవడంతో,అందరిపై రాళ్లు, కత్తులతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారని తెలిపారు.ఇప్పటికే ఐదు దఫాలు దాడులు చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవడంలో పోలీసు,రెవెన్యూ శాఖలు నిర్లక్ష్యం వైఖరి ప్రదర్శించాయని ఆరోపించారు. కాబట్టి నిందితులపై కిడ్నాప్, హత్యాయత్నం కేసులు నమోదు చేసి,రౌడీ షీట్ ఓపెన్ చేసి, బాధిత కుటుంబాలకు రక్షణ కల్పించాలనే డిమాండ్ చేశారు.

## ప్రశాంత్ నగర్‌లో

## వైభవంగా వినాయక చవితి ఉత్సవాలు

### - నిత్యపూజలతో ప్రశాంత్ నగర్ వినాయకుడు



**మదనపల్లి -ఆంధ్రనాడు, ఆగష్టు 30:** పట్టణంలోని ప్రశాంత్ నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడికి నిత్యపూజలు కొనసాగుతున్నాయి.శనివారం రోజు ఆర్టీసీ డిపోల ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు నాగూర్ వలి (షో ఆప్ శీనా),రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు పఠాన్ ఖాదర్ ఖాన్ స్వామివారిని దర్శించుకొన్నారు. టిడిపి యువ నాయకుడు ప్రవీణ్ రాయల్ వారికి ఘనస్వాగతం పలికి ఉత్సవ కమిటీ సాంప్రదాయాలతో సన్మానించారు.ఉత్సవాల విశిష్టతపై ప్రముఖుల ప్రశంసలు ఈ సందర్భంగా నాగూర్ వలి మాట్లాడుతూ భారత సంస్కృతి, సంప్రదాయాలకు పర్వదినాలు నిదర్శనమని అన్నారు.మదనపల్లి పట్టణంలో వినాయక చవితి వేడుకలు ఎంతో వైభవంగా జరుగుతున్నాయని,ముఖ్యంగా ప్రశాంత వినాయక చవితి ఉత్సవాలను ప్రతి సంవత్సరం నిర్వహిస్తారన్నారు.ఈ ఏడాది ఏర్పాటు చేసిన బొజ్జ గణపయ్య విగ్రహం భక్తులను ఆకట్టుకుంటోందని అన్నారు.మత సామరస్యం,భక్తులకు విశేష సేవలు హిందూ,ముస్లింకు ఐకమత్యంగా గణేష్ ఉత్సవాలను జరుపుకొని మత సామరస్యంలో దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నారని నాయకులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.ఉత్సవ కమిటీ ప్రతిరోజూ విశేష పూజలు నిర్వహిస్తూ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తున్నారు .

## అపోలో యూనివర్శిటీలో

## సైబర్ డిఫెన్స్ హ్యాకథాన్

### - మూడు రోజుల వర్క్‌షాప్ విజయవంతం

**చిత్తూరు-ఆంధ్రనాడు,ఆగష్టు 30:** ది అపోలో యూనివర్శిటీ, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన సైబర్ భద్రత, ఎథికల్ హ్యాకింగ్ హ్యాండ్స్-ఆన్ వర్క్‌షాప్ విజయవంతంగా ముగిసింది. ఈ వర్క్‌షాప్‌లో 100 మంది విద్యార్థులు, 25 జట్లుగా విడిపోయి ఆధునిక సైబర్ సవాళ్లను ఎదుర్కొని తమ ప్రతిభను చాటుకున్నారు.ముగింపు రోజు శనివారం హ్యాకథాన్ పోటీ నిర్వహించారు, ఇందులో గెలిచిన జట్లకు జిఐఆర్ టెక్నాలజీస్ సంస్థ ద్వారా సెక్యూరిటీ రంగం లో ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సైబర్ సెక్యూరిటీ సమస్యలను పరిష్కరించడానికి హ్యాకథాన్ విద్యార్థులకు అవకాశం కల్పించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైస్ చాన్సలర్ డా. హెచ్. వినోద్ భట్ హ్యాకథాన్ విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. యువతలో నైపుణ్యాలు, పరిశోధన, ఉద్యోగ అవకాశాల అవగాహన పెంచడంలో ఈ వర్క్‌షాప్ కీలకమని తెలిపారు. అపోలో యూనివర్శిటీ ఎల్లప్పుడూ సాంకేతిక రంగంలో అవకా శాలు, నైపుణ్యాలు, పరిశోధనా మార్గాలు అందించడంలో ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ డాక్టర్ జగదీషన్, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్లు డాక్టర్ మంజు, డాక్టర్ హిమబిందు, రీసోర్స్ పర్సన్, సీఐఆర్ టెక్నాలజీ సిఈవో సృజన్ అట్లూరి, విద్యార్థులు పాల్గొన్నారు.



## డిప్యూటీ సూపరిండెంట్

## సానే రెడ్డప్ప పదవీ విరమణ

### - రెడ్డెప్పను సన్మానించిన

### జనసేన పార్టీ వైస్ సర్పంచి తిరుమల హరినాథ్



**ఐరాల -ఆంధ్రనాడు, ఆగష్టు 30 :** డిప్యూటీ సూపర్డెంట్‌గా పదవి విరమణ పొందిన సానే రెడ్డప్ప, ఐరాల మండలం వేదగిరి వారి పల్లి జనసేన పార్టీ వైస్ సర్పంచ్ తిరుమల హరినాథ్ పదవి విరమణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని సానే రెడ్డప్పని ఘనంగా గజమాల దుశ్యాలవతో సన్మానించారు, అనంతరం ఆయన రెడ్డప్ప చేసిన పనులను సమావేశంలో కొనియాడారు, ఆయన వృత్తి పరంగా చిన్న పెద్ద బేధం లేకుండా అందరితో సమానంగా కలిసిపోతూ అందరి మనసులో స్థానం సంపాదించుకున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, పీలేరు ఆర్టీసీ డిపో అధికారులు, బంధువులు, మిత్రులు, తమ్మిశెట్టి హేమ కిషోర్, సింగంశెట్టి చాణిక్య, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పురుషోత్తం, తమ్మిశెట్టి జనార్దన్, తిరుమల వినయ్, తిరుమల ధనుష్, సింగంశెట్టి చంద్రశేఖర్, కక్కే బాలకృష్ణ, అనిల్, బాలాజీ, దినేష్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

## కరెన్సీ కూరగాయలు

## పండ్లు అలంకారంలో వినాయకుడు

### - రూ.8 లక్షల కరెన్సీతో ఆకట్టుకున్న వైనం



**పలమనేరు-ఆంధ్రనాడు,ఆగష్టు 30:** పలమనేరు పట్టణంలోని సూరప్ప వీధిలో నిలిపిన వినాయకుడు అత్యంత ఆకర్ష ణీయంగా భక్తులకు దర్శనం ఇ చ్చాడు. వినాయక చవితిని పురస్కరించు కొని ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు ఒక్కో చోట ఒక్కోరకంగా దర్శనం ఇస్తూ ఆకట్టుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో సూరప్ప వీధిలో నిలిపిన వినాయకుడికి శనివారం రూ. 8లక్షల కరెన్సీతో పాటు ఒక టన్ను పండ్లు,మరో టన్ను బరువు గల కూరగాయలతో ప్రత్యేకంగా అలంకారం చేశారు.దీంతో భక్తులు విశేషంగా పాల్గొని వినాయక స్వామి దర్శనం చేసుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా అక్కడి నిర్వాహకులు,మణి కంఠ ఫ్రూట్ స్టాల్ యజమాని మురళీ మాట్లాడుతూ..... ఈ వీధిలోని అందరి సహకారాలతో ఈ అలంకరణ చేశామన్నారు.అందరూ మట్టి వినాయకులను పూజించాలని కోరారు.పర్యావరణమును కాపాడుకొనేందుకు పట్టణంలో 60శాతం వరకు మట్టి వినాయకులను నెలకొల్పుతుండడం ఎంతైనా ఆనందదాయకమన్నారు.మిగిలిన వారు కూడా రాబోవురోజులలో మారుతారన్న నమ్మకం ఉందన్నారు.

## గణనాధుని సేవలో ఏపీ రాష్ట్ర

## ఆర్.టి.ఐ కమిషనర్ చావలి సునీల్



**కాణిపాకం- ఆంధ్రనాడు ఆగష్టు 30 :** గణనాధుని సేవలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ చావలి సునీల్. కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారిని దర్శిం చుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ ఆర్‌టిఐ చావలి సునీల్, వీరికి స్వాగతం పలికిన దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్, దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేసిన డీఈవో సాగర్‌బాబు, ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపర్డెంట్ కోదండపాణి, తదితరులు పాల్గొన్నారు.

## ఆపోలో బి.ఫార్మసీ

## విద్యార్థులు పరిశ్రమ సందర్శన

**చిత్తూరు- ఆంధ్రనాడు, ఆగష్టు 30:** ఆపోలో యూనివర్సిటీ బి.ఫార్మసీ విద్యార్థులు తిరుపతిలోని టాక్సిన్ ఏఆర్ బయోలాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను సందర్శించారు. ఈ సందర్శన ద్వారా విద్యార్థులకు ఔషధ పరిశ్రమలో తాజా టాక్సికాలజీ పరిశోధన, ప్రీ-క్లినికల్ పరీక్షలు, గుడ్ ల్యాబొరేటరీ ప్రాక్టీసెస్ , పరిశ్రమ నిబంధనలపై ప్రాథమిక అవగాహన కల్పించారు. పరిశ్రమ నిపుణులు విద్యార్థులతో ముఖాముఖి సమావేశాలు నిర్వహించి, డ్రగ్ సేఫ్టీ, పరిశోధన నమూనాలు, పరిశ్రమలో ఉన్న ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు. ఈ సందర్శన వల్ల విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న సిద్ధాంతాలను పరిశ్రమ స్థాయిలో ఎలా ఉపయోగించుకోవచ్చో బాగా అర్థం చేసుకున్నారు. ఈ కార్య క్రమాన్ని స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ డీన్ డాక్టర్ భాస్కర్‌రెడ్డి, బి.ఫార్మసీ అధ్యా పకులు సమన్వయం చేశారు. టాక్సిన్ డైరెక్టర్ డా. సయ్యద్ రహమతుల్లా, సీఈఓ డా. సయ్యద్ నాసిర్ అహమ్మద్ పాల్గొని, విద్యార్థుల పరిశోధనా, ప్రొఫెషనల్ అభిరుచిని మరింత పెంపొందించేలా మార్గదర్శకం అందించారు.

# అంగరంగ వైభవంగా వినాయకుడి నిమజ్జనోత్సవం

**బి.కొత్తకోట ఆంధ్రనాడు ఆగస్టు30:** పట్టణంలోని పోకనాటి వీధి శ్రీకోదండ రామస్వామి దేవస్థానం దగ్గర ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహానికి నాలుగు రోజులుపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు.పోకనాటి వీధి వినాయక కమిటీ మరియు ధర్మకర్తలు ఆధ్వర్యంలో ఉభయదారుల సహకారంతో ప్రతిరోజూ విశేష అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.నిత్య పూజలందుకున్న గణపయ్యను శనివారం కళాకారులతో ప్రత్యేక మేళ తాళాలు, బళ్లారి డ్రమ్స్,భజనలు నడుమ కోలాహలంగా వినాయకుడు విగ్రహాన్ని నిమజ్జనానికి సాగనంపారు.ముందుగా ప్రత్యేక పూజలు చేసి,పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించి ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని సందడిగా నిర్వహించారు. అనంతరం భక్తి శ్రద్ధలతో, కళాకారులతో మేళతాళాలతో



బాణాసంచా పేలుస్తూ నిమజ్జన కార్యక్రమం కన్నుల పండుగలా నిర్వహించారు.

**రూ.35300 వేలు పలికిన గణపయ్య లడ్డు**

గణపతికి సమర్పించిన లడ్డూను వేలంపాట ఆసక్తికరంగా సాగింది.డి.వినోద్ కుమార్ రెడ్డి రూ.35300 వేలతో హెచ్చుపాట పాడి దక్కించుకున్నారు.ఈ సందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.వినాయక చవితి వేడుకలను జయప్రదం చేసిన ప్రజలకు పోకనాటి వీధి యూత్ కృతజ్ఞతలు తెలిపారు. అన్నదాన కార్యక్రమ దాత గీతాల శేషు శైలందర్ నాథ్ రెడ్డి,కంచి లోకేష్ రెడ్డి,మా రెడ్డి సతీష్ రెడ్డి, కంచి కోదండ, వి.వి రెడ్డి కంచి కళ్యాణ్ కుమార్ రెడ్డి, వంక దశరథ రామ్ రెడ్డి,రాయి నారాయణరెడ్డి, ఎర్రగుంట్ల మోహన్ రెడ్డి, రామాంజి రెడ్డి పాల్గొన్నారు.

# ఆరు పరిశ్రమలతో ముఖ్యమంత్రి ఎంఓయు

**కుప్పం-ఆంధ్రనాడు, ఆగస్టు 30:** కుప్పం మునిసిపాలిటీ పరిధిలో పరమసముద్రం బహిరంగ సభ అనంతరం ఆరు పరిశ్రమలతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మౌఖిక ఒప్పందం చేసుకున్నారు. కుప్పం పరిధిలో వ్యర్థాల నుంచి సంపద కార్యక్రమం అమలు చేసేందుకు ఎన్ జి ఎస్ – ఐటీసీతో ఒప్పందం చేసుకున్నారు.. వ్యర్థాల సుస్థిర నిర్వహణపై ఇంటింటి ప్రచారం, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలను 15 ఏళ్ల పాటు నిర్వహించేలా ఒప్పందం చేసుకున్నారు. కుప్పంలో మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయడం, మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను గ్రామీణ ప్రాంతాల్లో మార్కెటింగ్ అంశాలపై షీ లీడ్స్ సంస్థతో ఒప్పందం చేసుకున్నారు. నియోజకవర్గంలో 10వేల మంది మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడంలో పాటు గ్రామీణ మార్కెటింగ్ను అందింపుచ్చుకునేందుకు శిక్షణ ఇస్తుంది. కుప్పంలో రూ.1100 కోట్ల పెట్టుబడితో ఫైబర్ బోర్డు ఉత్పత్తి కోసం కింగ్స్ ఫుడ్ డెకార్ సంస్థతో ఒప్పందం, దీని ద్వారా 2012 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు రానున్నట్లు తెలిపారు. రూ.150 కోట్ల పెట్టుబడితో ఏడాదికి 70 నుంచి 100 శిక్షణకు ఉపయోగించే 2 సీటర్ విమానాలను తయారు చేయనున్న పయనీర్ యాంప్స్ సంస్థతో ఒప్పందం, బెంగళూరు చెందిన స్పేస్ టెక్నాలజీ సంస్థ అవగాహన ఒప్పందం, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్ హబ్ ఏర్పాటు చేసేందుకు రెడ్ బెర్రీ ఫుడ్ లాజిస్టిక్స్ తో ఒప్పందం




చేసుకున్నారు. అనంతరం పరిశ్రమల స్థాపనకు వచ్చిన పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి ముఖాముఖి నిర్వహించారు. పరిశ్రమల స్థాపనకు తలెత్తుతున్న సమస్యలపై పారిశ్రామిక వేత్తలు ముఖ్యమంత్రికి వివరించారు. సందర్భంగా ఆయన స్పందిస్తూ.. ధైర్యంగా పరిశ్రమలను నెలకొల్పాలన్నారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా రాలేదని, పారిశ్రామికవేత్తలు భయపడి వెనక్కి వెళ్లారన్నారు. వెనక్కి వెళ్లిన ప్రతి ఒక్క పారిశ్రామికవేత రాష్ట్రం ఎన్డీయే ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ధైర్యంగా పరిశ్రమలు పెట్టేందుకు ముందుకొస్తున్నారని, ఇది రాష్ట్రానికి శుభ సూచికమని అన్నారు. కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, కలెక్టర్ సుమిత్ కుమార్, జేసీ విద్యాధరి, కడా పీడీ వికాస్ మర్మత్ తదితరులు ఉన్నారు.

# శ్రీసిటీలో అలరించిన వీణావాదన

**శ్రీ సిటీ - ఆంధ్రనాడు, ఆగస్టు 30:** శ్రీ సిటీ ఆధ్యాత్మిక, సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో శనివారం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో పూజా కార్యక్రమాల అనంతరం భక్తిరసభరిత వీణా వాద్య కచేరి భక్తులను ఎంతగానో అలరించింది. ఆహ్లాదకరమైన ప్రకృతి ఒడిలో యువ కళాకారిణి వాకచర్ల సుష్మా తమ వీణా వాదనతో ఆలయ వాతావరణాన్ని ఆధ్యాత్మికానందంతో నింపింది. త్యాగరాజ కీర్తన "శ్రీ గణనాథం భజామ్యహం" (కనకాంగి రాగం) తో కచేరీ ప్రారంభించిన ఆమె, తరువాత అన్నమాచార్య కీర్తనలు "శ్రీమన్నారాయణ శ్రీమన్నారాయణ" (భౌళి రాగం), "ముద్దుగారే యశోద" (కురుంజి రాగం), "జగడపు చనవుల" (హిందోళ వసంతం), "అదివో అల్లదివో" (మధ్యమావతి) లను మధురంగా, రాగతాళాల సమన్వయంతో వీణవాదన చేసి శ్రోతలను ఆకట్టుకున్నారు. సుష్మను ప్రతిభను అభినందించిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్. రవీంద్ర సన్నారెడ్డి, శ్రీవాణి వేదికగా స్థానిక యువ కళాకారుల ప్రతిభను ప్రోత్సహిస్తూ ఆధ్యాత్మిక %-% సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుండడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న అమెరికా డెట్రాయిట్ కు చెందిన ప్రముఖ వ్యాపార వేత్త భరత్ రెడ్డి సుష్మను అభినందిస్తూ జ్ఞాపికను బహుకరించి సత్కరించారు. పాలేటి




హేమ లక్ష్మి నుంచి మొదట శిక్షణ పొందిన సుష్మ తరువాత డిఎస్ రఘూన్సీ మార్గదర్శకత్వంలో సూళ్లూరుపేటలోని ఎంజిఆర్ సంగీత పాఠశాలలో కొనసాగించారు. ఈ కార్యక్రమానికి శ్రీసిటీ పరిసర గ్రామాల నుంచి కూడా భక్తులు హాజరై, సంగీతానుభూతితో పాటు స్వామివారి కృపకు పాత్రులైనారు. భక్తులకు తీర్థప్రసాదం, అన్నప్రసాదం పంపిణీ చేశారు. శ్రీసిటీ పిఆర్ఓ బాలాజీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

# హాస్టల్ భవనానికి శంకుస్థాపన

**బైరెడ్డిపల్లి, ఆంధ్ర నాడు, ఆగస్టు30:** బైరెడ్డి పల్లి మండలంలోని కమ్మనపల్లి ఆంధ్రప్రదేశ్ రెసిడెన్సియల్ బాలికల గురుకుల పాఠశాలలో శ్రీ లక్ష్మీ ప్రసాద్ ఛారిటీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ ఆమోదంతో, రూ. 2 కోట్లతో నిర్మించనున్న బాలికల వసతి గృహ నిర్మాణానికి ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, స్కూల్ అభివృద్ధి కమిటీ ఆయనకు ఘనంగా స్వాగతం తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. నూతన సంస్కరణలతో సమర్థ వంతమైన విద్యా విధానం అమలు చేస్తున్నామని, పలమనేరు ప్రాంతాన్ని ఎడ్యుకేషన్ హబ్ గా మార్చడానికి అన్ని అనుకూలతలు ఉన్నాయని యువగళం పాదయాత్ర సందర్భంలో ఈ విషయమై ప్రస్తుత విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ తో చర్చించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ సమాజహితానికి కృషి చేయాలని, పాఠశాలలో వసతి గృహ నిర్మాణానికి ముందుకొచ్చిన ట్రస్ట్ నిర్వాహకులను ఆయన అభినందించారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థుల సౌకర్యార్థం డ్రిల్ చేయించిన బోరు మోటార్ ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీఆం ాఈఐ సొసైటీ సెక్రటరీ మస్తానయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ సుమిత్ర మరియు తెలుగుదేశం పార్టీ మండలాధ్యక్షులు కిషోర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి



సుబ్రహ్మణ్యం శెట్టి, సింగిల్ విండో చైర్మన్ నాగరాజుతో పాటు శ్రీ లక్ష్మీ ప్రసాద్ ఛారిటీస్ ఫౌండేషన్ నిర్వాహకులు వంశీధర్, సత్య తదితరులున్నారు.

# గిరిజనుల కోసం ప్రత్యేక ఆధార్ శిబిరాలు

**తిరుపతి కలెక్టరేట్ -ఆంధ్రనాడు, ఆగస్టు 30:** తిరుపతి జిల్లా కలెక్టర్, జిల్లా మ్యాజిస్ట్రేట్ ఆదేశాల మేరకు, ఆధార్ కార్డు లేని గిరిజనులను గుర్తించి వారికి అవసరమైన పత్రాలు జారీ చేయించి ఆధార్ సౌకర్యం కల్పించుటకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు ప్రకటనలో తెలియజేశారు. ఈ శిబిరాలు 2025 సెప్టెంబర్ 1 నుండి 2026 జనవరి 17 వరకు వివిధ మండలాలలో వరుసగా నిర్వహించబడతాయని శ్రీకాళహస్తి సెప్టెంబర్ 1 నుండి 6 వరకు, చిల్లకూరు 8 నుండి 13 వరకు, చిట్టమూరు 15 నుండి 20 వరకు, ఏర్పేడు 22 నుండి 27 వరకు, తిరుపతి రూరల్ 29 నుండి అక్టోబర్ 4 వరకు, నాయుడుపేట అక్టోబర్ 6 నుండి 11 వరకు, బుచ్చినాయుడు కండ్రిగ 13 నుండి 18 వరకు, పుత్తూరు 20 నుండి 25 వరకు, కె.వి.బి.పురం 27 నుండి నవంబర్ 1 వరకు, తొట్టంబేడు 3 నుండి 8 వరకు, బాలాయపల్లి 10 నుండి 15 వరకు, చంద్రగిరి 17 నుండి 22 వరకు, సూళ్లూరుపేట అర్బన్ 24 నుండి 29 వరకు, వడమాలపేట డిసెంబర్ 1 నుండి 6 వరకు, గూడూరు అర్బన్ 8 నుండి 13 వరకు, యర్రావారిపాలెం 22 నుండి 27 వరకు, పాకాల 29 నుండి జనవరి 3 వరకు, తిరుపతి అర్బన్ 5 నుండి 10 వరకు, సూళ్లూరుపేట అర్బన్ 12 నుండి 17 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆధార్ కార్డులు లేని గిరిజనులు తప్పనిసరిగా ఈ శిబిరాలకు హాజరై తమ నమోదు పూర్తి చేసి, గిరిజన సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు చురుకుగా పాల్గొని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చేయాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# సామాజిక తనిఖీ ప్రజావేదిక సెప్టెంబర్ 3కి వాయిదా

**బి.కొత్తకోట ఆంధ్రనాడు ఆగస్టు30:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఏప్రిల్ 01,2024 నుండి మార్చి 31,2025 వరకు మండలంలోని15 గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాలలో జరిగిన సామాజిక తనిఖీపై శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జరగవలసిన ప్రజావేదిక కార్యక్రమం సెప్టెంబర్ మూడవ తేదీ (బుధవారం)కి వాయిదా పడినట్లు బి.కొత్తకోట ఎంపీడీవో కృష్ణవేణి పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా బి.కొత్తకోట మండలంలో ఏడాదిలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ జరిగిందని,ఈ సామాజిక తనిఖీలో గుర్తించిన అంశములపై ఉపాధి హామీ కూలీలు,ప్రజా ప్రతినిధులు,సంబంధిత అధికారులు సెప్టెంబర్ 3వ తేది ఉదయం 10 గంటలకు,ఎంపిడిఓ కార్యలయపు ఆవరణంలో సామాజిక తనిఖీ కార్యక్రమంపై ప్రజావేదికను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఈ ప్రజావేదికకు ఉపాధి హామీ కూలీలు ప్రజాప్రతినిధులు,సంబంధిత అధికారులు తప్పకుండా హాజరు కావాలని ఆమె కోరారు.

# తిరుపతి జాబ్ మేళాలో 107 మంది ఉద్యోగాలు



**తిరుపతి కలెక్టరేట్ -ఆంధ్రనాడు, ఆగస్టు 30:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎస్వీసీసీ డిగ్రీ కళాశాల, తిరుపతిలో శనివారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘు వాన్సీ, ప్రారంభించారు. ప్రభుత్వం నిరుద్యోగ యువత ఉపాధి కల్పనపై ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని, ప్రతి మూడు నెలలకు ఒకసారి నియోజకవర్గ స్థాయిలో జాబ్ మేళాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. వేతనాలపై కాకుండా, అందిన అవకాశాలను వినియోగించుకోవాలని యువతకు ఆయన సూచించారు. జాబ్ మేళాకు 14 బహుళజాతి కంపెనీలు హాజరయ్యాయని, మొత్తం 172 మంది యువతీ యువకులు హాజరుకాగా, 107 మంది ఉద్యోగాలకు ఎంపిక కాగా, 12 మంది షార్ట్‌లిస్ట్ అయ్యారు. ఎంపికైన వారికి ట్రైనీ కలెక్టర్ మెప్మా పీడీ రవీంద్ర ఆఫర్ లెటర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి, ఆర్.లోకనాథం, ఎస్వీసీసీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజా తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లూరు పద్మనాభరెడ్డి ఇంట్లో చోరీ

**బైరెడ్డిపల్లి-ఆంధ్రనాడు, ఆగస్టు30:** మండల కేంద్రంలోని కమ్మనపల్లి పంచాయితీ, ఇల్లూరు గ్రామానికి చెందిన పద్మనాభ రెడ్డి ఇంట్లో 200 గ్రాములు చోరీ జరిగినట్టు బైరెడ్డిపల్లి రక్షణ శాఖ సిబ్బందికి శుక్రవారం తెలిపారు.పద్మనాభ రెడ్డి మాట్లాడుతూ గత 10 రోజులు మునుపు వారి నివాసానికి రంగులు వేయడానికి బంధువులు సహకారంతో బెంగళూరులో వృత్తి నిమిత్తంగా పని చేస్తున్న ఉత్తర ప్రదేశ్ కు చెందిన పేయి%శీ%ట్ కూలీలను తీసుకొచ్చి వారి నివాసానికి రంగులు వేయడం జరిగింది.రంగులు వేయడం పూర్తి దశకు వచ్చే మునువు చోరీకి పాల్పడి నట్టే తెలుస్తుంది. వినాయక చవితి రోజు ఇంట్లో వారు నగలు కోసం బీరువా చూసే సరికి నగదు లేకపోవడంతో పిర్యాదు చేసారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఎంపీడీవోకు ఫిర్యాదు

**నాగలాపురం - ఆంధ్రనాడు, ఆగష్టు 30:** నాగలాపురం మండలం బీరకుప్పం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులుగా నియమకంపై గ్రామంలో గ్రామ సభ పంచాయితీ కార్యదర్శి రమణ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో వార్డ్ నెంబర్, గ్రామ సర్పంచ్ ప్రకటించిన



అభ్యర్థినే పరిగణలోకి తీసుకున్నారు తప్ప గ్రామసభలో ఉన్న ప్రజల యొక్క అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండానే గ్రామ సభ ముగించారు. ఈ సందర్భంగా గ్రామంలోనే ప్రజలు గతంలో క్షేత్రస్థాయికుడిగా పనిచేసిన వ్యక్తిపై ఆర్థిక ఆరోపణలు ఎక్కువగా ఉండడంతో అభ్యర్థిని ఉద్యోగం నుండి తొలగించారు. కానీ ఎప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గతంలో ఆరోపణలపై ఉద్యోగం నుండి తొలగించిన వ్యక్తి భార్య గీత ను క్షేత్ర సహాయకురాలుగా నియమించుకున్నట్లు తీర్మానించారు. కావున ఈ అభ్యర్థి భర్తపై ఉన్న ఆరోపణలను పరిగణలోకి తీసుకొని పరిశీలించి కొత్త అభ్యర్థిని నిర్మించాలంటూ గ్రామ ప్రజలు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో బాలాజీ నాయక్ కు వినతి పత్రాన్ని సమర్పించారు.

## రాజకీయ పార్టీ ప్రతినిధులతో డీఆర్‌వో సమీక్ష




**తిరుపతి కలెక్టరేట్ -ఆంధ్రనాడు, ఆగస్టు 30:** ఓటర్ల జాబితాలో నమోదు, తొలగింపులు, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై జిల్లా రెవిన్యూ అధికారి నరసింహులు ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీకి చెందిన పులివర్తి సుధ రెడ్డి, భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.డి. వర ప్రసాద్, సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి వి. నాగార్జు, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి. కలిందర్, వైఎస్సార్సీపీ జిల్లా ఇన్‌చార్జ్ చంద్రమోహన్ రెడ్డి, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు నీరుగట్టు నగేష్ పాల్గొన్నారు. సమావేశంలో ఆగస్టు 28, 2025 వరకు వచ్చిన క్లైములు, అభ్యంతరాల పరిష్కారంపై అధికారులు వివరాలు తెలియజేశారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు సంబంధించి సూచనలు కోరారు. అన్ని పార్టీల ప్రతినిధులకు పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకం తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా టిడిపి ప్రతినిధి సుధరెడ్డి చంద్రగిరి నియోజకవర్గంలోని కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సంఖ్య అధికంగా ఉండటంతో వాటిని సర్దుబాటు చేయాలని, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ నేత డి. కలిందర్ పోలింగ్ సమయంలో ఏజెంట్లకు సంబంధించిన పూర్తి వివరాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా వినాయక చవితి వేడుకలు




**తంబళ్లపల్లి-ఆంధ్రనాడు, ఆగస్టు 30:**వినాయక చవితి వేడుకలను తంబళ్లపల్లి మండలంలో ఈ ఏడాది అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు.తంబళ్లపల్లి మండల కేంద్రంలోని పాత కళాశాల మైదానంలో గణేష్ యూత్, వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు ఎంతో అట్టహాసంగా జరుగుతున్నాయి. శనివారం మధ్యాహ్నం వినాయక మండపం వద్ద తంబళ్లపల్లికి చెందిన కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఉత్సవాలలో భాగంగా మూడవ రోజు శుక్రవారం రాత్రి హైదరాబాద్ వారిచే ఏర్పాటు చేసిన వెంట్రీలాక్విజం కార్యక్రమం అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. పెద్ద సంఖ్యలో పిల్లలు, పెద్దలు, యువత, ప్రజలు, భక్తులు తరలివచ్చి ఎంతో ఉత్సాహంగా కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం చిన్నారులు, తల్లితండ్రులు డ్యాన్స్, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ విశేషంగా అలరించాయి.కార్యక్రమాల్లో పాల్గొన్న పిల్లలకు, పెద్దలకు గణేష్ యూత్ వారు ప్రోత్సాహక బహుమతుకు అందజేశారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు శ్రీచైతన్య విద్యార్థుల ఎంపిక



**శ్రీకాళహస్తి - ఆంధ్రనాడు , ఆగస్టు 30 :** పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో ఉన్న శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ఈనెల 28వ తేదీన తిరుపతిలో జరిగిన ఉమ్మడి చిత్తూరు జిల్లా అథ్లెటిక్స్ పోటీలలో విజయం సాధించి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు . షాట్ పుట్ అండర్ 16 బాలుర విభాగంలో 9వ తరగతికి చెందిన జెషిత్ హర్ష మొదటి స్థానాన్ని సంపాదించి బంగారు పథకాన్ని సొంతం చేసుకున్నాడు . అండర్ 14 బాలికల విభాగంలో 8వ తరగతి యశస్వి రెండవ స్థానంలో నిలిచి రజిత పథకాన్ని సొంతం చేసుకోగా ,7వ తరగతి విద్యార్థి ధృవి 3వ స్థానంలో నిలిచి కాంస్య పథకాన్ని సొంతం చేసుకుంది . ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ఎ.రూపాదేవి మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభ,కృషి,పట్టుదల మరియు క్రమశిక్షణ వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు .ఎ. జి.ఎం సురేష్ మాట్లాడుతూ క్రీడలలో సాధించిన విజయాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడుటమే కాకుండా సంస్థ ప్రతిష్టను మరింత పెంచారని తెలుపుతూ ....విజేతలుగా నిలిచిన ప్రతి విద్యార్థికి అభినందనలు తెలిపారు . ఈ కార్యక్రమంలో కో- ఆర్డినేటర్ బాలాజీ , పి.ఈ.టి మేఘన , ఇన్చార్జులు త్రివేణి , కల్పన తదితరులు పాల్గొన్నారు .

## డప్పు కళాకారుల డిమాండ్లు నెరవేర్చండి




**శ్రీకాళహస్తి - ఆంధ్రనాడు , ఆగస్టు 30 :** రాష్ట్రంలోని డప్పు కళాకారుల న్యాయపరమైన డిమాండ్లను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య డిమాండ్ చేశారు . పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్ లో శనివారం డప్పు కళాకారుల సంఘం జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ గతంలో చంద్రబాబునాయుడు దళిత తేజం పేరిట డప్పు కళాకారులను ఆదుకుంటామని చెప్పి అన్యాయం చేశారని విమర్శించారు . జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం సైతం చంద్రబాబు బాటలోనే నడిచిందని మండిపడ్డారు . దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆలయాలలో డప్పు కళాకారులకు సభ్యత్వం కల్పించాలని డిమాండ్ చేశారు . రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో డప్పు కళాకారులకు శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు . అర్హులైన డప్పు కళాకారులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు . గుర్తింపు కలిగిన డప్పు కళాకారులకు ఆర్టీసీ బస్సుల్లో, రైళ్ళలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు . ప్రతి డప్పు కళాకారునికి ప్రభుత్వం ఇల్లు కట్టించాలనీ , వ్యవసాయం చేసుకోవడానికి రెండెకరాల పొలం ఇవ్వాలని కోరారు .

# మహిళా సాధికారతే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే పులివర్తి నాని



**చంద్రగిరి-ఆంధ్ర నాడు, ఆగస్టు 30:** రాష్ట్ర మహిళల సాధికారతే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదని చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని అన్నారు.శనివారం నియోజకవర్గ కేంద్రమైన చంద్రగిరి ముఖ ద్వారమైన నాగాలమ్మ కూడలి నుంచి,వ్యవసాయ మార్కటట్ యార్డ్న వరకు సాగిన భారీ స్త్రీ శక్తి విజయోత్సవ ర్యాలీ సూపర్ హిట్ అవటమే కాక,అనంతరం ఏర్పాటు చేసి మహిళల సభ విజయవంతంగా సాగింది. ఈ సభలో ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి రాక్షస పాలన సాగించి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందన్నారు.రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి ఇబ్బంది కరంగా ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాలన్నింటిని కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్నదన్నారు.సూపర్ సిక్స్ లో ఒకటైన స్త్రీ శక్తి పథకం విజయవంతంగా అమలు చేసి మహిళలకు పెద్దపీట వేసిందన్నారు.సీఎం నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర భవిష్యత్తు కోసం పి 4 ప్రణాళికను రూపొందించి,మన ముందు తరాల వారికి బంగారు బాట వేయటానికి పాలన కొనసాగిస్తున్నారని వివరించారు. టిడిపి కార్యకర్తలే తన కుటుంబమని,తాను అందరికీ అన్నీ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించి, నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నానన్నారు.టిడిపి మహిళా నేత పులివర్తి సుధా రెడ్డి మాట్లాడుతూ గత చంద్రగిరి వైసిపి యంయల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనకు,తన కుటుంబానికి చాలా ద్రోహం చేయడమే కాకుండా తమ కుటుంబాన్ని లేకుండా చేద్దామనుకున్నాడని,దేవుడు దయతో, మీ అందరి ఆశీస్సులతో బ్రతికి బయటపడ్డా మని పేర్కన్నరు.నియోజకవర్గంలోని ప్రతి మహిళకు తాను తోడుగా ఉంటానని, నియోజకవర్గ ప్రజలందరూ వైసిపి నాయకులు చెప్పే మాయ మాటలు నమ్మకండని తెలిపారు. నియోజకవర్గాల పునర్విభజనలో చంద్రగిరి నియోజకవర్గ చిన్నాభిన్నం జరుగుతుందనే పుకార్లను నమ్మొద్దని ఆమె విజ్ఞప్తి చేశారు.గత పది ఏళ్ల వైసిపి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చంద్రగిరిని అన్యాయాలకు, అక్రమాలకు, దోపిడీకి అడ్డాగా తయారు చేశారని మండిపడ్డారు.గంజాయితో యువత భవిష్యత్తును సర్వనాశనం చేశారని విమర్శించారు.సీఎం నారా. చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ సహాయసహకారంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, గాలి పుష్పలత, ఏ ఈశ్వర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గౌస్ బాషా, సిడిఎంఎస్ చైర్మన్ సుబ్రహ్మణ్యం నాయుడు,వి రమేష్ రెడ్డి, జడ్పిటిసి నంగా పద్మజా రెడ్డి,సురేష్ నాయుడు, అమ్మినేని మధు, వైకుంఠం శ్రీధర్ నాయుడు, పార్టీ అధ్యక్షులు, ఎం తిరుమలరెడ్డి,ఏజిపల్లి బాలకృష్ణ, నాగరాజు నాయుడు,బెల్లంకొండ మురళి, చేకూరి జనార్దన్ చౌదరి, మధు శేఖర్, మాజీ ఎంపీపీ టీ కేశవుల నాయుడు, నరసింహారెడ్డి, కూటమి పార్టీల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

**చంద్రగిరిలో స్త్రీ శక్తి భారీ ర్యాలీ**

స్త్రీ శక్తి విజయోత్సవ సభ సందర్భంగా చంద్రగిరిలో శుక్రవారం ఉదయం 11 గంటలకు నాగాలమ్మ గుడి నుండి వ్యవసాయ మార్కెట్ యార్డ్ వరకు టిడిపి మహిళా నేత సుధా రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్త్రీ శక్తి విజయోత్సవ ర్యాలీ, సభలో పాల్గొనేందుకు నియోజకవర్గంలోని ఆరు మండలాల నుండి మహిళలు వేలాదిగా తరలివచ్చారు. చంద్రగిరి పట్టణం మొత్తం మహిళలతో కిటకిటలాడింది.సూపర్ సిక్స్ పథకమైన స్త్రీ శక్తి విజయోత్సవ సభ, ర్యాలీ సూపర్ హిట్ గా సాగింది. ర్యాలీలో ఎమ్మెల్యే పులివర్తి నాని, పులివర్తి సుధా రెడ్డిలు వేరువేరుగా పాదయాత్రగా ప్రజలను పలకరిస్తూ సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ర్యాలీ కార్యక్రమంలో మహిళలు పాటలు పాడుతూ,డాన్సులు వేస్తూ, కోలాహలంగా మహిళలందరూ కూడా పాదయాత్రగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో సీఐ ఇమ్రాన్ పర్యవేక్షణలో పోలీసులు గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.





# ప్రత్యేక ఆకర్షణగా నేతాజీ వీధి గణనాథుడు





**తిరుపతి రూరల్ -ఆంధ్రనాడు, ఆగస్టు 30:** వినాయక చవితి ఉత్సవాలు ఎక్కడ చూసినా ఘనంగా సాగుతున్నా, తిరుచానూరు నేతాజీ వీధిలో మాత్రం ప్రతి ఏడాది వినాయక మండపం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ప్రతిసారీ కొత్త ఆలోచనతో గణనాథుడిని భక్తుల ముందుకు తీసుకువచ్చే నిర్వాహకులు గత ఏడాది అయోధ్య బాలరాముని నమూనాతో గణనాథుని ఏర్పాటుచేసి ప్రజల, భక్తుల మన్నలను పొందారు. ఈసారి మరింత విశిష్టమైన ఆలోచనను ఆచరణలో పెట్టారు. అయ్యప్ప స్వామి ఆలయ నమూనాతో సుందరంగా రూపుదిద్దుకున్న గణనాథుడు భక్తులకు, మరీ ముఖ్యంగా మహిళలకు ఆధ్యాత్మికానందాన్ని పంచుతూ, కొత్త అనుభూతిని కలిగిస్తున్నారు. గణనాథుడు అయ్యప్ప స్వామి రూపంలో శోభాయమానంగా కూర్చొని దర్శనమిస్తున్న దృశ్యం భక్తుల హృదయాలను హరిస్తుంది. నేతాజీ వీధి వినాయక మండప నిర్వాహకులు కాళహస్తి వాసు, దక్షిణాది కిరణ్ లు మాట్లాడుతూ... ఈ ఆలయ ముఖ్య కారణం ఏమిటంటే అయ్యప్ప స్వామి ఆలయంలో కొంతమంది మహిళలకు ప్రవేశ ఉండదని నేతాజీ వీధిలో గణపతి అయ్యప్ప స్వామి ఆలయంలో మహిళలందరికీ ప్రవేశం కల్పించడం ముఖ్య ఉద్దేశమనన్నారు. ప్రతి ఏడాది వినాయకుడిని కొత్త రూపంలో భక్తులకు చూపాలన్న ఆలోచనతో, చాలా సంవత్సరాలుగా కొత్త కొత్త ఆలోచనతో గణనాథుని కొలువ తీర్చామని, గత ఏడాది అయోధ్య బాలరామ మందిరం సెట్టింగ్ లో అయోధ్య బాలరాముని అవతారంలో గణపయ్యను కొలువు తీర్చామని, దాంతో భక్తుల నుంచి అపూర్వస్పందన లభించిందని, ప్రతి ఏడాది భక్తుల ఉత్సాహం మాకు స్ఫూర్తి నిస్తుందని, ఈసారి అయ్యప్ప ఆలయ నమూనా గణనాథుని కొలువు తీర్చామని, విభిన్నమైన ఆధ్యాత్మిక వాతావరణాన్ని కలిగించటంతో భక్తులు ఎంతో ఆనందంగా స్పందిస్తున్నారని తెలిపారు. వినాయక మండపాన్ని దర్శించుకోవడానికి తిరుపతి పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో కుటుంబ సమేతంగా వచ్చి అయ్యప్ప గణనాథుని దర్శించుకుంటున్నారని, కొంతమంది మహిళలకు అయ్యప్ప ఆలయ ప్రవేశం లేకపోవడంతో ఇక్కడే అయ్యప్ప స్వామి ఆలయాన్ని దర్శించుకున్న అనుభూతిని పొందుతున్నారని, చిన్నా పెద్దా అందరూ గణనాధుని శోభను ఆస్వాదిస్తూ, భక్తి భావంతో క్షణాలను గడుపుతున్నారని అన్నారు. నేతాజీ వీధి గణనాథుడు అయ్యప్ప ఆలయ శోభలో దర్శనమివ్వడం ఈ వినాయక చవితికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కే.నాగరాజు, టీ.ముని, శ్రీధర్, బాలాజీ, సి.మురళి, కిరణ్, ఆనంద్, మునికుమార్, సాయి పాల్గొన్నారు.

## జిల్లాలో స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ ప్రారంభం

**తిరుపతి కలెక్టరేట్ -ఆంధ్రనాడు, ఆగస్టు 30:** తిరుపతి జిల్లాకు వచ్చిన 5,80,120 స్మార్ట్ రైస్ కార్డులు రేషన్ కార్డు దారులకు దశలవారీగా పంపిణీ జరుగుతున్నాయని జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రకటనలు తెలిపారు. జిల్లా అధికారుల వివరాల ప్రకారం, మొదటి విడతలో ఆగస్టు 25 నుండి 31 వరకు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కార్డులు అందజేస్తున్నారు. రెండవ విడతలో, సెప్టెంబర్ 1 నుండి 15 వరకు మిగిలిన స్మార్ట్ రైస్ కార్డులు సంబంధిత ఫెయిర్ ప్రైస్ షాప్ డీలర్ల ద్వారా ఈ-పిఓఎస్ యంత్రాల సహాయంతో పంపిణీ చేయనున్నారని జిల్లా సంయుక్త కలెక్టర్ తెలిపారని అన్నారు. ఇప్పటి వరకు కార్డు పొందని వారు తప్పనిసరిగా తమకు కేటాయించిన ఫెయిర్ ప్రైస్ షాప్ వద్ద హాజరై కార్డు పొందాలని సూచించారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని అన్ని కార్డు హోల్డర్లు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పౌరసరఫరాల అధికారి ఆ ప్రకటనలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## కార్డుదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ



**పెద్దపంజాణి, ఆంధ్రనాడు, ఆగస్టు 30 :** కార్డుదారులకు శనివారం ప్రభుత్వం మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను వీఆర్వో, సచివాలయ సిబ్బంది స్థానిక నాయకుల ఆధ్వర్యంలో పంపిణీ చేసినట్లు తహసీల్దార్ హనుమంతు తెలిపారు. మండలంలో 40చౌకదుకాణాలు వుండగా ప్రభుత్వం నుండి మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డులు ఆయా షాపు పరిధిలో అధికారులు ఐదు రోజులపాటు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్డుదారులు అధికారులు గ్రామాల్లో పర్యటించి కార్డులు పంపిణీ చేసే సమయంలో అందుబాటులో ఉండి తీసుకోవాలని సూచించారు.

## రెండు ద్విచక్ర వాహనాలు ఢీ - వ్యక్తి కి గాయాలు

**పెద్దపంజాణి, ఆంధ్రనాడు, ఆగస్టు 30 :** రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో నాగరాజు (40) అనే వ్యక్తి గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పలమనేరు సమీపంలోని పెంగరగుంటకు చెందిన నాగరాజు ద్విచక్ర వాహనంపై పుంగనూరుకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా పలమనేరు నుండి పుంగనూరు వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం పంజాని సత్రం మసీదు వద్ద ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగరాజు గాయపడగా స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



**తవణంపల్లి-ఆంధ్రనాడు, ఆగస్టు 30...**చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలం కేంద్రంలోని అరగొండ చిత్తూరు రోడ్డులో తవణంపల్లి మండల కేంద్రంలోని రాజా ఫొటో స్టూడియో వద్ద చిత్తూరు జిల్లా గంగవరం మండలం కీలపట్ల హరిజనవాడ చెందిన టీ.మునేంద్ర వాళ్ల నానమ్మ టి.నారాయణమ్మ న(భర్త లేట్ మునిరత్నం)తన యొక్క పల్సర్ మోటార్ సైకిల్ లో వెనుక ఎక్కించుకొని కాణిపాకం గుడికి వెళుటకు వాళ్ళ ఇంటి నుండి వస్తూ ఉండగా ఆ సమయంలో చిత్తూరు నుండి అరగొండ వెళ్లు ఏ.పీ.ఎస్ ఆర్టీసీ బస్సు రిజిస్ట్రేషన్ నెంబర్ ఏ.పీ29 జెడ్ 1766 బస్సు ఎదురుగా వస్తూ డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా నిర్లక్ష్యంగా నడుపుతూ వచ్చి వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనంలో ఉన్న నారాయణమ్మను సదరు బస్సు కుడివైపు మధ్య భాగము ఆమె కుడి భుజం తాకడంతో మోటార్ సైకిల్ నుండి వెనక్కిపడిపోవడంతో సదరు బస్సు వెనక చక్ర%శీ% ఆమె తలమీద ఎక్కి దిగడంతో బలమైన రక్త గాయాలతో ఆమె అక్కడికక్కడే చనిపోవడం జరిగింది.ఈ ఘటనపై ఆమె మనవడు టీ.మునేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## మండలంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ



**బంగారుపాళ్యం-ఆంధ్రనాడు,ఆగస్టు 30..**చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని శనివారం సచివాలయ సిబ్బంది స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో రేషన్ షాపుల వద్ద చేపట్టారు.ఇందులో భాగంగా మండలంలోని గుండ్లకటమంచి పంచాయతీలో స్మార్ట్ రేషన్ కార్డు పంపిణీ కార్యక్రమంలో ఎక్స్ జెడ్పిటిసి కళావతి మహేంద్ర పాల్గొని లబ్ధిదారులకు కార్డులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మండలం టిడిపి టిడిపి ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి డి.నాగరాజు,గ్రామ కమిటీ అధ్యక్షులు రమేష్, గ్రామ కమిటీ సెక్రటరీ మురళీకృష్ణ,గ్రామ కమిటీ జనరల్ సెక్రెటరీ పృథ్వీరాజ్,రేషన్ షాప్ డీలర్,గ్రామ పెద్దలు వెంకటాద్రి మహిళలు పాల్గొన్నారు.

## సిఆర్సి సమావేశాలను సందర్శించిన ఏ.పి.సి.



**నాగలాపురం - ఆంధ్రనాడు, ఆగస్టు 30:** నాగలాపురం పట్టణంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న సిఆర్సి సమావేశాలను సందర్శించిన ఏపిసి గౌరీ శంకర్, ఏ.యం.ఓ శివ శంకర్. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగిస్తూ సిఆర్సిలను సక్రమంగా వినియోగించుకోవాలని, అనుభవాలను షేర్ చేసుకోవాలని, సిఆర్సి సమావేశంలో నేర్చుకున్న విషయాలను విద్యార్థులకు గుణాత్మక, నాణ్యమైన విద్యను అందించడానికి వీలవుతుందని, పాఠశాలలో నమోదు శాతం పెంచడానికి చక్కగా ఉపయోగపడుతుందనీ, ఉపాధ్యాయులు వినూత్నమైన, నూతన పద్ధతులు కృత్యాదార పద్ధతిలో బోధన సాగించాలని, విద్యార్థులు చదవు పట్ల భయాందోళనకు గురికాకుండా ఆహ్లాదకరమైన బోధనను బోధించడానికి సిఆర్సి సమావేశాలు చక్కగా ఉపయోగపడుతుందని పాఠశాలకు వచ్చే ప్రతి విద్యార్థి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఏపిసి గౌరీ శంకర్ తెలియజేశారు.

# నిరంతరం కుప్పం అభివృద్ధి కై ముఖ్యమంత్రి ఆరాటం

### - రాష్ట్ర జలనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



**కుప్పం-ఆంధ్రనాడు, ఆగస్టు 30:** ఆసియా లోని అతిపెద్ద కెనాల్ ను పూర్తి చేసిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కే దక్కిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. శనివారం కుప్పం మునిసిపాలిటీ పరిధిలోని పరమ సముద్రం చెరువు సమీపంలో ఏర్పాటు చేసిన జల హారతి బహిరంగ సభలో రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆసియా లోని అతిపెద్ద కెనాల్ ను పూర్తి చేసిన ఘనత ముఖ్యమంత్రికే దక్కిందన్నారు. హెచ్ ఎన్ ఎస్ ఎస్ ద్వారా కరువు ప్రాంతమైన రాయలసీమ జిల్లాను ముఖ్యమంత్రి సస్యశ్యామలం చేస్తున్నారన్నారు. నిరంతరం కుప్పం ప్రాంత అభివృద్ధి కై ముఖ్యమంత్రి ఆరాట పడుతున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి కరువు ప్రాంతమైన రాయలసీమ ను రతనాలసీమగా మార్చాలని నాటి స్వర్గీయ నందమూరి తారకరామ రావు నుండి, నేటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి వరకు తెలుగు గంగ, గాలేరు నగరి, హంద్రీనీవా, కేసి కెనాల్, హెచ్ ఎల్ సి, ఎల్ ఎల్ సి, మైలవరం, జీడిపల్లి, గొల్లపల్లి, చిత్రావతి, తదితర జలాశయాలకు అత్యంత నిధులు ఖర్చు చేసిన ప్రభుత్వం తమదేనన్నారు. 1999 జూలై 9 న రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా హంద్రీ-నీవా కాలువ పనులు భూమి పూజ జరిపారని, తిరిగి ఆయన చేతుల మీదుగా పూర్తి చేసి కుప్పం నీరందించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకున్నారన్నారు. 738 కిలోమీటర్ల పొడవున హంద్రీ-నీవా కాలువకు 732 మీటర్ల ల ఎత్తుకు 27 లిఫ్ట్ ల ద్వారా ఆసియాలోనే అతిపెద్ద కెనాల్ ను పూర్తి చేసి అభినవ శ్రీకృష్ణదేవరాయులుగా రాష్ట్ర ముఖ్యమంత్రి నిలిచారని అభివర్ణించారు. ఓటు వేసేవారు అభివృద్ధికే పట్టం కట్టాలన్నారు. గత పాలకులు తమ 5 సంవత్సరాల పాలనలో ఏనాడో ఒక తట్ట మట్టిని కూడా వేయలేదని, వారి విధ్వంసకర పాలనలో పోలవరంతో పాటు డయాఫ్రమ్ వాల్ ధ్వంసం అయ్యిందని, అన్నమయ్య, పులిచింతల గేట్లు కొట్టుకుపోయింది, హెచ్ ఎన్ ఎస్ ఎస్ మోటారు బిల్లు లను కూడా గత ప్రభుత్వం చెల్లించలేదన్నారు. తద్వారా రాయలసీమకు తీరని ద్రోహం చేసిన ముఖ్యమంత్రి గా వై ఎస్ జగన్ నిలిచారన్నారు. సినిమా సెట్టింగ్ లతో హంద్రీ-నీవా కాలువ ప్రారంభించి హెలికాప్టర్ వెళ్ళే లోపే కాలువలో నీరు ఇంకిపోయిందని దుయ్యబట్టారు. అలాగే అత్యంత వెనుకబడిన ప్రాంతమైన ప్రకాశం జిల్లాలోని వెలుగొండ ప్రాజెక్ట్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి పుట్టిన రోజున శ్రీకారం చుడితే ఎన్నికలకు ముందు పనులు పూర్తి చేయకనే జాతికి గత ముఖ్యమంత్రి అంకితం చేశారన్నారు. వారిదంతా అబద్ధపు సంక్షేమన్నారు. రాయలసీమను రతనాల సీమగా మార్చే బాధ్యత ను తీసుకున్న ముఖ్యమంత్రి కి రాయలసీమ ప్రాంత ప్రజలు అండదండలందించాలన్నారు. 19 నియోజకవర్గాల్లోని ప్రతి చెరువుకు నీరు అందిస్తామన్నారు. ఆయన మంత్రివర్గంలో తాను పని చేయడం తన భాగ్యమన్నారు.

**ఎన్టీఆర్ సంకల్పాన్ని సాకారం చేసిన సీఎం చంద్రబాబు...**

**-ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్**

నాడు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు హంద్రీ-నీవా ద్వారా జలాలను తెచ్చేందుకు సంకల్పం చేస్తే దాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సాకారం చేశారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. కోట్లమంది జీవితాలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా మార్చుతున్నారన్నారు. కుప్పం నియోజకవర్గ ప్రజల ఎన్నో ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ కృష్ణా జలాలను హంద్రీ-నీవా ద్వారా కుప్పం కు తీసుకురావడం జరిగిందన్నారు. 2014-19 లో 87 శాతం పనులు పూర్తికాగా తరువాత వచ్చిన వై సి పి ప్రభుత్వం కోర్టు లో కేసులు వేసి పనులు ఆపారన్నారు. ప్రజా సంక్షేమం కోరని వారు పనులను ఆపితే భగీరథ ప్రయత్నానికి మించి శ్రీశైలం నుండి 1200 అడుగుల ఎత్తులో ఉన్న కృష్ణా జలాలను కుప్పానికి తెప్పించి కుప్పం దాహార్తిని, సాగునీటిని అందించిన అభినవ భగీరథునిగా నారా చంద్రబాబునాయుడు నిలిచారన్నారు. కృష్ణా జలాలు పరమ సముద్రానికి తెచ్చిన రోజుని సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ రోజుగా అభివర్ణించారు. ఈ మహోన్నత కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్ళవలసిన అవసరం ఉందన్నారు. రానున్న రోజుల్లో ప్రతి చెరువుకు నీరు అందించేలా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించాలన్నారు. ప్రతి పొలానికి ఈ నీరు చేరుతుందని, కలసికట్టుగా అందరం పని చేసి కుప్పం ప్రాంతాన్ని అగ్రగామిగా నిలపాలన్నారు.

**అభివృద్ధి సంక్షేమం చంద్రబాబుకు రెండు కళ్ళు...**

**- ఎంపి దగ్గుమళ్ళ ప్రసాద్ రావు**

శ్రీశైలం నుండి 735 కి.మీ ల ప్రయాణం చేసి చివరి మైలు కుప్పం లోని పరమసముద్రం కు కృష్ణా జలాలు చేరిందన్నారు. తద్వారా వ్యవసాయం చాలా బాగా పెరగడమే కాకుండా భూగర్భ జలాలు కూడా పెరుగుతుందన్నారు. కుప్పం నియోజకవర్గం లోని 530 చెరువులకు నీరు చేరాలన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు గా రాష్ట్ర ముఖ్యమంత్రి పని చేస్తూ కేంద్రప్రభుత్వం నుండి ఎన్నో నిధులను రాష్ట్రానికి తీసుకొస్తున్నారన్నారు. భవిష్యత్ తరాల వారు సిఎం చేసిన అభివృద్ధి గురించి మాట్లాడుకుంటారన్నారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి కార్యదర్శి పి.ఎస్.ప్రద్యుమ్న, జలవనరుల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి. సాయి ప్రసాద్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జే సి విద్యాధరి, కడా పిడి వికాస్ మర్మత్ మర్మత్, పలమనేరు ఎం ఎల్ ఏ ఎన్. అమరనాథ్ రెడ్డి, ఏ పి ఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, జిల్లా అధికారులు, కుప్పం ఆర్డీవో శ్రీనివాసులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం సభా వేదిక సమీపం లో కుప్పం ప్రాంత అభివృద్ధి సంస్థ మరియు ఆంధ్ర ప్రదేశ్ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుప్పం ప్రకృతి దర్శిని వాహనాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించి కుప్పం ప్రకృతిదర్శిని బ్రౌచర్ ను ఆవిష్కరించారు.

## క్రీడా పరికరాలు వితరణ

**సత్యవేడు - ఆంధ్రనాడు, ఆగస్టు 30:** సత్యవేడు మండలంలోని 11 ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు హైదరాబాద్ జీటా గ్లోబల్ నిర్వహణ వీ టు హెల్ప్ యు స్వచ్ఛంద సంస్థ క్రీడా పరికరాలను వితరణ చేశారు. శనివారం సత్యవేడు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఇన్చార్జి హెచ్ఎం పాండు రంగయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వీటుహెల్ప్ యు స్వచ్ఛంద సంస్థ సభ్యులు బాలచంద్రారెడ్డి, రాకేష్ ఎంఈఓ రవితో కలిసి క్రీడా పరికరాలను ఆయా పాఠశాల పీఈటి మాస్టర్లకు అందించారు. ఈ సందర్భంగా వీటు హెల్ప్ యు స్వచ్ఛంద సంస్థ సభ్యులు బాలచంద్రారెడ్డి మాట్లాడుతూ క్రీడారంగంలో విద్యార్థులు వారి సత్తాను చాటాలన్న ఉద్దేశంతో పాఠశాల విద్యార్థులకు క్రీడా పరికరాలను తమ స్వచ్ఛంద సంస్థ అందిస్తుందన్నారు. పాఠశాలలో క్రీడా పరికరాలు అందుబాటులో ఉండటం వల్ల విద్యార్థుల అభివృద్ధికి తగ్గట్టు వారు క్రీడా రంగాన్ని ఎంచుకొని అనుకున్న లక్ష్యాలను సాధించుకోవచ్చునున్నారు. గత ఏడాది కూడా తమ సంస్థ తరఫున విద్యార్థుల్లో కంప్యూటర్ పరిజ్ఞానం పెంచాలని ఉద్దేశంతో పాఠశాలకు కంప్యూటర్ పరికరాలను అందించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అంత మునుపు 11 ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు దాదాపు రు 81 వేలు విలువ చేసే క్రీడా పరికరాలను అందించారు. ఇందులో ముఖ్యంగా వాలీబాల్, ఫుట్బాల్, త్రోబాల్, టెన్నికాయస్, క్యారం బోర్డు, స్టార్ బాల్ వంటి క్రీడా పరికరాలు ఉన్నట్టు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పిఈటి మాస్టర్ మురళి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పిఈటి మాస్టర్లు వెంకట కృష్ణయ్య, మనీ, భాస్కర్, షమీకుమార్, వెంకటేశు, ఢిల్లీ రాణి, రాజాది, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## ఖరీఫ్ పంట సాగుపై అవగాహన

**సత్యవేడు - ఆంధ్రనాడు, ఆగస్టు 30:** పంటలకు ఎరువులు వాడే ముందు రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు నిర్వహించుకునేల చూడాలని సత్యవేడు వ్యవసాయ శాఖ ఏడి సుబ్రహ్మణ్యం కోరారు. శనివారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో తిరుపతి డిఆర్సి ఆధ్వర్యంలో ఖరీఫ్ పంట సాగు, ఏపీఏ ఐఎంఎస్ యాప్పై వ్యవసాయ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఏడి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పంట సాగులో ఎరువులను సరైన మోతాదులో ఉపయోగించాలన్నారు. తద్వారా నేల సారం పెరగడంతో పాటు ఖర్చులు తగ్గి పంట దిగుబడులు అధికమవుతుందన్నారు. పైగా పంటలకు అవసరమైన పోషకాలను సమతుల్యంగా అందించడం ద్వార పెరిగే అవకాశం ఉందన్నారు.



Printed, Published Edited and Owned by M.HARIBABU, Printed at AKSHARA PRINTERS, 1st Floor, SSS Complex, Air Bypass Road, Tirupati Town, Tirupati District, A.P., Published at AKSHARA PUBLICATIONS, Tirupati, Editor : M.Hari Babu , Cell : 9490400684, RNI: 2009/28733